
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 9 అక్టోబరు 2025



రహదారులకు మహర్దశ

అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎనిమిది రాష్ట్ర రహదారులు, మరో ఎనిమిది జిల్లా ప్రధాన రహదారులకు రూ.36.80 కోట్లు మంజూరు చేసింది. వీటితో 108.30 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి కానున్నాయి. వీటికి సంబంధించిన పనుల్లో ఇక రహదారులు, భవనాల శాఖ నిమగ్నం కానుంది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 16 రోడ్ల అభివృద్ధికి రూ. 36.80 కోట్లు మంజూరు

- రాష్ట్ర రహదారులు 8, జిల్లా ప్రధాన రహదారులు 8 ఎంపిక
- 108.30 కిలోమీటర్లు అభివృద్ధి కానున్న రహదారులు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ సిటీ: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రాష్ట్ర రహదారుల(ఎస్‌హెచ్) అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎనిమిది రాష్ట్ర రహదారులకు రూ.36.80 కోట్లు, ఎనిమిది జిల్లా ప్రధాన రహదారులకు రూ.31.70 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో 52.26 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులను, 56.4 కిలోమీటర్లు జిల్లా ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు రహదారులు, భవనాల శాఖ సమాయత్తం అవుతోంది. ఆర్‌అండ్‌బీ విజయవాడ, మైలవరం, మచిలీపట్నం డివిజన్‌లలో రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులు(ఎండీఆర్) రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. గత ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు సైతం నిధులు మంజూరు కాకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల కారణంగా ఎంతో మంది ప్రమాదాలకు గురైన ఉదంతాలు ఉన్నాయి. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ఈ ఏడాది జూలై నుంచి కురిసిన భారీ వర్షాలు రోడ్లను మరింత దెబ్బతీశాయి. వరద నీటి ప్రవాహంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొన తేలిన రాళ్లపై ప్రయాణం నరకప్రాయమైంది. అయితే ఈ మూడు సర్కిల్‌లలో దెబ్బతిన్న రోడ్లను ఆర్ అండ్ బీ అధికారులు ఎప్పటికపుడు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

ఉమ్మడి జిల్లా ప్రధాన రహదారులు ఇవే..

విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రి టన్నెల్, మద్రాస్-కోల్‌కతా పాత రోడ్డు 4.10 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.2.70 కోట్లు, కేవీఆర్ బైపాస్, ఎన్‌హెచ్-65 నుంచి గోకరాజు పల్లి వయా గండేపల్లి, నందలూరు, తాటిగుమ్మి 10.40 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, జగ్గయ్యపేట-షేర్ మహ్మద్‌పేట రోడ్డు 1.60 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.50 కోట్లు, ఉప్పులూరు నుంచి మద్దూరు, పునాదిపాడు నుంచి పెదపారుపూడి 7.70 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.4.90 కోట్లు, ఎంపీ రోడ్డు నుంచి కోసూరుకు వయా నిమ్మకూరు, అవురుపూడి 8 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.10 కోట్లు, పర్ణశాల, గండేపూడి రోడ్లకు రూ.4.20 కోట్లు, నాగాయలంక-కోడూరు రోడ్డుకు 4.50 కోట్లు, ఎర్రమాడు, కొమ్మిరెడ్డిపల్లి, తిరువూరు రోడ్ల అభివృద్ధికి రూ.4.70 కోట్లు మంజూరయ్యాయి.



రాష్ట్ర రహదారులకు మోక్షం

ప్రాధాన్యత క్రమంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. విజయవాడ డివిజన్‌లోని రెండు రోడ్లకు, మైలవరం డివిజన్‌లోని ఒక రోడ్డుకు, మచిలీపట్నం డివిజన్‌లోని ఐదు రోడ్లకు నిధులు విడుదలయినట్లు పేర్కొన్నారు. వీటిల్లో చిల్లకల్లు-వేదాద్రి-బండిపాలెం-కొణకంచి రోడ్డు ఎనిమిది కిలోమీటర్ల అభివృద్ధికి, జగ్గయ్యపేట-వేదాద్రి రోడ్డు 3.5 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, నందిగామ-పొక్కునూరు రోడ్డు ఐదు కిలోమీటర్ల అభివృద్ధికి రూ.2.80 కోట్లు, మైలవరం-నూజీవీడు రోడ్డు 4.08 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.6 కోట్లు, గన్నవరం-పుట్టగుంట రోడ్డు 8.8 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.7 కోట్లు, మచిలీపట్నం-కమ్మవారిచెరువు(వయా చిన్నాపురం) రోడ్డు ఏడు కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.6 కోట్లు, మచిలీపట్నం-కమ్మవారిచెరువు(వయా కోన) రోడ్డు 3.63 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.3 కోట్లు, కొత్తవరం-నిడుమోలు-ఐలూరు రోడ్డు 7.45 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, నడుపూరు-వాడవల్లి-కోరుకొల్లు రోడ్డు 4.8 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యం ఉద్యోగులకు శాపంగా మారింది. జీతాలు, ఇతర సప్లిమెంటరీ బిల్లులు అందక మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. బిల్లులపై సకాలంలో సంతకాలు, ఆన్‌లైన్‌లో వేలిముద్ర వేయాల్సిన కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులే తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



మూణ్నెళ్లుగా జీతాల్లేవ్!

బిల్లులు పెండింగ్ పెట్టిన మచిలీపట్నం కార్పొరేషన్ అధికారులు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వార్డు సచివాలయ ఉద్యోగులు
- కార్పొరేషన్ కార్యాలయ సిబ్బందికి తప్పని ఆర్థిక అవస్థలు
- బిల్లులు క్లియర్ చేయడం లేదని కమిషనర్‌పై ఆగ్రహం
- జిల్లా ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకోలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఇటీవల కాలంలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీలు జరిగాయి. 15 రోజుల్లో పూర్తి చేయాల్సిన ఈ ప్రక్రియను రెండు నెలల పాటు సాగదీశారు. దీంతో సచివాలయ సిబ్బంది ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. మునిసిపల్ కార్యాలయ అధికారులు, కూటమి నాయకులు తమ చిత్తానుసారంగా సచివాలయ సిబ్బందికి సంబంధించిన బదిలీల జాబితాలను పలుమార్లు తయారు చేసి ఇవ్వడంతో ఈ వ్యవహారంలో గందరగోళం ఏర్పడింది. బదిలీల ప్రక్రియ కుదుటపడటానికి రెండు నెలల సమయం పట్టింది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత జీతాల బిల్లులు చేయడంలోనూ జాప్యం జరిగింది. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లు ఉండగా, వాటిలో కనీసంగా 500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరితో పాటు మునిసిపల్ మిగతా 6లో..

వ్యర్థాలను కొనే స్వచ్ఛ రథాలు వచ్చేశాయ్



డీపీవో కార్యాలయం వద్ద స్వచ్ఛరథాలు

జిల్లాకు 9 రథాల కేటాయింపు

- పైలెట్ ప్రాజెక్టుగా 9 మండలాల్లోని 14 గ్రామాలు ఎంపిక
- బందరులో ప్రారంభించిన డీపీవో అరుణ
- నగదుకు బదులుగా నిత్యావసరాల విక్రయం



ఎస్ఎన్‌గొల్లపాలెంలో స్వచ్ఛ రథం వద్ద వ్యర్థాలు విక్రయించి నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేసే స్వచ్ఛ రథాలు గ్రామాలకు వచ్చేశాయి. జిల్లాకు తొమ్మిది రథాలను అధికారులు కేటాయించారు. ఇవీ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన 14 గ్రామాల్లో తిరగనున్నాయి. మచిలీపట్నంలో స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల కొనుగోలును జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ బుధవారం ప్రారంభించారు. స్వచ్ఛ రథాల వద్ద ప్రజల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేసి, వారికి ఇవ్వాల్సిన నగదుకు సరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. బందరు మండలం పోతేపల్లి తదితర గ్రామాల్లో స్వచ్ఛ రథాలు తిరుగుతున్నాయి. అవనిగడ్డ మండలం అవనిగడ్డ, బాపులపాడు మండలంలో బాపులపాడు, గన్నవరం మండలంలో గన్నవరం, బుద్ధవరం, కేసరపల్లి, గుడ్లవల్లేరు మండలంలో గుడ్లవల్లేరు, కంకిపాడు మండలంలో కంకిపాడు, పునాదిపాడు, ఈడ్పుగల్లు, మచిలీపట్నం మండలంలో పోతేపల్లి చుట్టు పక్కల గ్రామాలు, నాగాయలంక మండలంలో నాగాయలంక, చల్లపల్లి మండలంలో చల్లపల్లి, పెనమలూరు మండలంలో పెనమలూరు, గంగూరు గ్రామాల్లో తొమ్మిది స్వచ్ఛరథాలు పర్యటిస్తాయి. ఈ రథాలకు స్క్రాప్ డీలర్లను నియమించారు.

వ్యర్థాల ధరలు ఇలా..

కిలో చొప్పున ఇనుము రూ.20, న్యూస్‌పేపర్లు రూ.15, పుస్తకాలు రూ.10, అట్టపెట్టెలు రూ.10, ప్లాస్టిక్ బాటిల్స్ రూ.20, గాజు బాటిల్స్ రూ.2, స్టీల్ వస్తువులు రూ.40, అల్యూమినియం వస్తువులు రూ.120కి కొనుగోలు చేస్తున్నారు. అలాగే స్వచ్ఛ రథం విక్రయించే నిత్యావసరాల ధరలు కిలో గోధుమ పిండి రూ.60, కొబ్బరి నూనె బాటిల్ రూ.18, సర్ఫ్ ప్యాకెట్ రూ.12, బట్టల సబ్బు రూ.10, వంటి సబ్బు రూ.10, టీ పౌడర్ రూ.3, పేస్ట్ రూ.10, కిలో పెద్ద ఉల్లిపాయలు రూ.23, టూత్‌బ్రష్ రూ.11, పెన్ను రూ.3, పెన్సిల్ రూ.5, వేరుశనగ గుళ్ల పావుకిలో రూ.32, మినపగుళ్ల పావుకిలో రూ.30, కందిపప్పు పావుకిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు.

గ్రావెల్ దొంగలు!

మెట్లపల్లి అటవీ ప్రాంతంలో గుట్టుగా తవ్వకాలు.. రాత్రివేళ తరలింపు

- టాక్టర్లు, జేసీబీలను పట్టుకుని గార్డుకు అప్పగించిన స్థానికులు
- వదిలేసిన అటవీశాఖ అధికారులు
- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు ఫిర్యాదుతో వెలుగులోకి..





మెట్లపల్లి అడవిలో జూలైలో జరుగుతున్న తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) జామాయిల్ చెట్లు నరికి ఆనవాళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెట్లపల్లి అడవిలో గుట్టుగా జరిగిన గ్రావెల్ తవ్వకాల బాగోతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎకరం పైగా అటవీ విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. సరిగ్గా ఈ ఏడాది జూన్, జూలైల మధ్యలో ఈ అక్రమ తవ్వకాలు జరిగినట్టు తెలుస్తోంది. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్)కు ఫిర్యాదు అందటంతో ఈ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. అటవీశాఖ అధికారుల సహాయ సహకారాలతోనే ఈ అక్రమ తవ్వకాలు జరిగినట్టుగా తెలుస్తోంది. మెట్లపల్లి అడవిలో జరిగిన అక్రమ తవ్వకాలు బయటకు వెలుగు చూడకుండా అటవీశాఖాధికారులు జాగ్రత్తలు పడ్డారు. తొలుత మెట్లపల్లి గ్రామస్థులు ఈ అక్రమ తవ్వకాలను గుర్తించి అడ్డుకున్నారు. అడవిలోనే అనధికార క్వారీ ఏర్పాటు చేసి గ్రావెల్‌ను తరలిస్తుండటంతో స్థానికులు నిఘా పెట్టారు. మొత్తం ఎనిమిది ట్రాక్టర్లు, రెండు జేసీబీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పట్లో గార్డుకు అప్పగించారు. ఆ తర్వాత పైస్థాయిలో ఏ అధికారిణి నుంచి ఆదేశాలు వచ్చాయో తెలియదు కానీ వాటిని వదిలేశారు. స్థానికులు గమనిస్తున్నారన్న ఉద్దేశ్యంతో రాత్రుళ్లు తవ్వకాలకు తెరలేపారు. దీంతో మెట్లపల్లి అడవిలో పెద్ద ఎత్తున గ్రావెల్ తోలకం జరిగింది. గ్రావెల్ అక్రమార్కులు ఎవరన్నది సస్పెన్స్‌గా మారింది. వేళ్లన్నీ అటవీశాఖ అధికారులవైపే చూపిస్తున్నాయి. గ్రావెల్ అక్రమ తవ్వకాల వెనుక అటవీ మిగతా 6లో..

జామాయిల్ మొక్కల నరికివేత

మెట్లపల్లి అడవిలో మరో దారుణం చోటు చేసుకుంది. అడవిలో ఉన్న జామాయిల్ చెట్లను కూడా అదే సమయంలో భారీగా నరికివేతకు పాల్పడిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. అడవిని పరిరక్షించాల్సినవారే జామాయిల్ మొక్కలను నరికివేయించారన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. వందల ట్రక్కులలో జామాయిల్ కలపను గుట్టుగా తరలించినట్టు తెలుస్తోంది. జామాయిల్ మొక్కలను నరికిన తర్వాత.. వాటికి చిగుళ్లు వచ్చి పెరిగిన తర్వాత వాటి కర్రలను కూడా నరికించి భారీగా తరలించటం తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది.

మొక్కలు నాటడంలోనూ అక్రమాలు

మెట్లపల్లి అటవీ ప్రాంతంలో అరణ్యాన్ని పెంచటం కోసం మొక్కలు నాటే కార్యక్రమానికి అటవీశాఖాధికారులు శ్రీకారం చుట్టారు. మొక్కలైతే నాటారు కానీ, ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. మొక్కలను కూలీల చేత నాటించాలని నిర్దేశించగా.. అటవీశాఖాధికారులు మాత్రం ప్రొక్లెయిన్లు తెప్పించి నాటించారు. ప్రొక్లెయిన్ల కారణంగా ఖర్చు తక్కువ అవుతుంది. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రికార్డులలో మాత్రం కూలీలతో పనిచేయించినట్టుగా చూపించినట్టు తెలుస్తోంది. నిర్దేశించిన మొక్కలు ఎన్ని నాటారన్నదానిపైనా అనేక విమర్శలు ఉన్నాయి. కాగా, గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఓ వైపు విచారణ నడుస్తుంటే.. మరో వైపు అధికార యంత్రాంగం ఇలా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపు దేశ చరిత్రలోనే విప్లవాత్మక నిర్ణయం
- మంత్రి కొల్లు రవీంద్ర
8లో

కొరమీను చేపల సాగుతో అదనపు ఆదాయం
- కలెక్టర్ బాలాజీ
8లో

ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్
6లో

నకిలీ కహానీలు!

నకిలీ మద్యం కేసులో వెలుగులోకి మరిన్ని లింక్‌లు

- శ్రీనివాస వైన్స్‌ను ముందే అనుమానించిన అధికారులు
- మేనేజర్ కల్యాణ్ అరెస్టు
- జనార్దన్‌తో మరికొన్ని వైన్స్‌కు లింకులు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మద్యం వ్యాపారులతో సత్సంబంధాలు



నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుతో మద్యం దుకాణాల యజమానులకు లింక్‌లు ఉన్నాయా? మందుబాబులు 'ఫుల్'గా ఉన్న సమయంలో నకిలీ మద్యం విక్రయించారా? అంటే ఎక్సైజ్ వర్గాలు అవుననే అంటున్నాయి. రాష్ట్రంలో సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులో కీలక సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు ఎక్సైజ్ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. త్వరలోనే తాను అన్ని విషయాలు వెల్లడిస్తానని చెప్పిన ఆయన న్యాయస్థానాల ద్వారా కేసులో రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నాడు. అసలు జనార్దనరావుతో ఎవరెవరికి లింక్‌లు ఉన్నాయో బయటకు లాగే ప్రయత్నంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): మద్యం వ్యాపారంలో పదేళ్లుగా జనార్దనరావు ఉన్నాడు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వెనుక జనార్దనరావు ఆలోచనలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం కేంద్రంగా ఏఎన్ఆర్ బార్‌ను నడుపుతున్న ఆయన విజయవాడతోపాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాల యజమానులతో మంచి సంబంధాలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. జనార్దనరావు బార్‌ను నడపడమే కాకుండా విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో భాగస్వామిగా ఉన్నాడు. ఈ వైన్స్‌ను తెలివిగా తన స్నేహితుడి పేరు మీద పెట్టించాడు. జనార్దనరావు ములకలచెరువులో తయారు చేయించిన నకిలీ మద్యానికి సంబంధించిన కేసులను శ్రీనివాస వైన్స్‌లో విక్రయించినట్టు తేలింది. ఈ వైన్స్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన వాగు సెంటర్‌కు చెందిన అంగులూరి కల్యాణ్‌ను పోలీసులు మిగతా 6లో..



ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం క్యూలైన్లలో భక్తులు పోటెత్తారు. దుర్గమ్మను దర్శించుకుని పరవశించిపోయారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్క్రీన్లతో చూపు చీకట్లోకి..

- చిన్న వయస్సులోనే దృష్టి లోపం
- ఫోన్లు, టీవీలపై ఎక్కువ సమయం గడపడమే ప్రధాన కారణం
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

8లో





విజయేంద్రప్రసాద్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సేవలో విజయేంద్ర ప్రసాద్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సినీరచయిత విజయేంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



స్టేషన్‌లో ప్రయాణికుల టికెట్ చెకింగ్ చేస్తున్న టీటీఈ

విజయవాడ డివిజన్‌లో రైల్వే టికెట్ డ్రైవ్

» రూ.35.46 లక్షల జరిమానా వసూలు

రైల్వేస్టేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్‌లో రైల్వే అధికారులు టికెట్ తనిఖీ డ్రైవ్‌లో రికార్డుస్థాయిలో రూ.35.46 లక్షల మేరకు జరిమానా వసూలు చేశారు. డ్రైవ్ తరువాత ప్రజల ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అత్యధిక టికెట్ చెకింగ్ ఆదాయం ఇదేనని డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న మెగా టికెట్ చెకింగ్ డ్రైవ్ నిర్వహించింది. దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంతకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 747 మంది సిబ్బంది పాల్గొన్నారు. 5,512 కేసులు నమోదు చేసి రికార్డుస్థాయిలో రూ.35.46 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా ఒకరోజు ఆదాయం రికార్డుగా నిలిచింది. గత నెల 28న జరిగిన రూ.35.16 లక్షల రికార్డును అధిగమించింది. డివిజన్ అంతటా పెద్దఎత్తున తనిఖీలు జరిగాయి. ఈఇంటెన్స్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణించినందుకు 2,154 కేసులు, సక్రమంగా ప్రయాణించనందుకు 3,277 కేసులు, లగేజీకి సంబంధించి 81 కేసులు నమోదు చేశారు. పండుగలు, సెలవుల సీజన్‌లో రద్దీకి సంబంధించి ప్రయాణికుల ఫిర్యాదులకు ప్రతిస్పందనగా డివిజన్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఇంటెన్సివ్ డ్రైవ్ తరువాత రోజుకు 22 ఫిర్యాదులకు గణనీయమైన తగ్గుదల నమోదైంది.

కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అనుభవం లేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ దుకాణంలోనైనా ఫార్మసిస్టులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ఫార్మసిస్టులు మందులు అందజేయాలని తెలిపారు. డ్రగ్ ఇనస్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె.అనిల్ కుమార్, డ్రగ్ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.



గుణదల విద్యుత్‌సౌధలో యాజమాన్యాలతో కార్మిక సంఘం ప్రతినిధుల సమావేశం

ఎన్టీటీపీఎస్ కార్మికుల సమస్యలపై విద్యుత్ సంస్థల సానుకూల స్పందన

» తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లోని ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు జెన్కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు సానుకులంగా స్పందించినట్టు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం గుణదల విద్యుత్‌సౌధలో యాజమాన్యాలతో కార్మిక సంఘం ప్రతినిధులు ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల బలోపేతానికి పనిచేస్తున్న యూనియన్‌కు యాజమాన్యాలు న్యాయం చేయాలని కోరామన్నారు. చర్చలు హామీలకే పరిమితం కాకుండా యాజమాన్యాలు ముందుగుడు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆధునీకరించిన పామర్రు బస్టాండ్

పామర్రు బస్టాండ్‌కు ఎన్టీఆర్ పేరు

పామర్రు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన పామర్రు బస్టాండ్‌కు నందమూరి తారకరామారావు ప్రయాణ ప్రాంగణంగా నామకరణం చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా విలేఖర్లతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లో పామర్రు బస్టాండ్ ఆధునీకరణకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ సొంత మండల కేంద్రమైన పామర్రులో 1984లో ఆయన శంకుస్థాపన చేసిన బస్టాండ్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

లెక్క చెప్పాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కూన రవికుమార్, పక్కన కలెక్టర్ లక్ష్మీశ

» శాసన వ్యవస్థ కమిటీలను తేలిగ్గా తీసుకుంటే ఉపేక్షించేది లేదు

» ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై కమిటీ చైర్మన్ సమీక్ష

» ఉన్నతాధికారుల గైర్హాజరుపై అసంతృప్తి

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖర్చుచేసే ప్రతి పైసా గురించి ప్రభుత్వరంగ సంస్థలు శాసనవ్యవస్థకు సమాధానం చెప్పాల్సి వుంటుందని సంస్థల సంఘం చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏడు ప్రభుత్వ రంగసంస్థల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన పీయూసీ చైర్మన్, సభ్యులకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, సొసైటీలతో కలిపి రాష్ట్రంలో సుమారు 236 ప్రభుత్వరంగ సంస్థలున్నాయని తెలిపారు. వీటికి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలు, ఖాతాల (అకౌంట్స్)పై కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. శాసన వ్యవస్థ స్టాట్యూటరీ కమిటీలలో ప్రభుత్వ లెక్కల సంఘం (పీఏసీ), అంచనాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (పీయూసీ) ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల సంఘం కాగితాలకే పరిమితమైందని, దీనిగురించి సంస్థల ఉన్నతాధికారులకు కూడా అవగాహన ఉండటం లేదన్నారు. కమిటీ ఆదేశాలను తేలిగ్గా తీసుకొంటే ఉపేక్షించేది లేదని, ఏ స్థాయి అధికారి అయినా పీయూసీ ముందు హాజరు కావాల్సిందేనని చెప్పారు. కొన్ని సంస్థల ఎండీలు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీసీపీడీసీఎల్, ఏపీ ఆయిల్ ఫెడ్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌ల నివేదికలపై కూలంకషంగా చర్చించారు. ఏపీసీపీడీసీఎల్‌కు ప్రభుత్వం, ప్రజల నుంచి అందాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని ఎందుకు చెల్లించడం లేదని, ఎక్కువ వసూలు చేసి తక్కువ ఎలా తిరిగిస్తారని ప్రశ్నించారు.

కమిటీ సభ్యుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వుండటం వల్ల జి.కొండూరు మండలంలో ఒకరు చనిపోయారని వీటిపై దృష్టిపెట్టాలని సూచించారు. మరో సభ్యుడు బత్తుల ఆనందరావు మాట్లాడుతూ, జూనియర్ లైన్‌మెన్‌లు వేరేవారి విద్యుత్ స్తంభంపైకి ఎక్కిస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటివి జరగకుండా చూడాలని చెప్పారు. ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆయిల్ ఫెడ్) లాభాల్లో కొనసాగుతుండటంపై ప్రభుత్వరంగ సంస్థల కమిటీ అభినందనలు తెలిపింది. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, అయితాబత్తుల ఆనందరావు, వర్ల కుమార్ రాజా, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగమునెయ్య, విభాగాధికారి సతీష్, విజయవాడ ఆర్డీవో చైతన్య, డీఆర్‌ఎం ఎం.లక్ష్మీనరసింహం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాపారుల ఇళ్ల వద్ద అధికారుల తనిఖీలు

విజయవాడలో ఐటీ దాడులు

» నకిలీ వ్యాపారుల గుట్టురట్టు



విజవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : కంది పప్పు, పెసరపప్పు, మినపప్పు ఇలా నకిలీ పప్పులను మార్కెట్లోకి దించి కోట్లాది రూపాయలు ఆర్జించిన వ్యాపారుల గుట్టును ఇన్‌కం ట్యాక్స్ అధికారులు రట్టు చేశారు. రాష్ట్రంలో ఈ తరహా వ్యాపారులు చేస్తున్న వారి ఇళ్లలో సోదాలు చేశారు. విజయవాడలో దేసు మురళీ ఇంట్లో ఇన్‌కం టాక్స్ అధికారులు సోదాలు చేశారు. పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పప్పుల వ్యాపారం ద్వారా కోట్లాది రూపాయలు వెనుకేసినట్టు తెలుస్తోంది.



అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో జేసీ ఇలక్కియా

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోండి

» ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు సంబంధిత అంశాలపై జేసీ ఎస్.ఇలక్కియా బుధవారం జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు, పౌరసరఫరాల మేనేజర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏఎస్వోలు, సీఎస్ డీటీలు, ఏడీఏలు, ఎంఏవోలు, వీఏఏలతో ఆమె ఛాంబర్‌లో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యం సాగు జరిగినట్టు జేసీ తెలిపారు. అందులో 2,00,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమికంగా అక్టోబరు 20 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, ఆర్‌ఎస్‌కేలలో గోనె సంచుల ఏర్పాటు, మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారెంటీ సేకరణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని, అలాగే వాహనాల రిజిస్ట్రేషన్, జీపీఎస్ వ్యవస్థాపనను త్వరితగతిన పూర్తిచేయాలని జేసీ సూచించారు.

ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు

» కృష్ణా జాయింట్ కలెక్టర్ నవీన్

గుడివాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు రైతులందరికి సకాలంలో సేవలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సత్యనారాయణపురంలోని ఇండియన్ మెడికల్ హాల్‌లో డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన అధికారులతో ధాన్యం సేకరణపై అవగాహన, సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలోని 287 రైతు సేవాకేంద్రాలు ఏర్పాటు చేయడంతో ధాన్యం సేకరణకు కావలసిన అన్ని పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది నియామకం కూడా పూర్తయిందన్నారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర క్వింటాకు సాధారణ రకం రూ.2,369, గ్రేడ్-ఏ రకం రూ.2,389లు కల్పించడంతో పాటు గన్నీస్, లేబర్, ట్రాన్స్‌పోర్టు వంటి అదనపు ప్రయోజనాలను కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి రైతులు ఆరబెట్టుకుని, శుద్ధిపరచుకుని ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర ఉండేలా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయి కమిటీ సభ్యులైన గ్రాయ వ్యవసాయ సహాయకులు(వి.ఎ.ఎ), సాంకేతిక సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, రైస్ మిల్లు దగ్గర నియమించిన కస్టోడియన్ అధికారులకు, రైస్‌మిల్లుల్లో పనిచేసే సిబ్బందికి ధాన్యం సేకరణపై పూర్తి స్థాయిలో అవగాహన, సాంకేతిక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ధాన్యం సేకరణపై అవగాహనతో పాటుగా వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం వీఏఏలకు ధాన్యం సేకరణపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, సహకారశాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నవీన్



ధాన్యం సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంచికచర్లలో నకిలీ ప్రకంపనలు!

» పలు బెల్టు షాపుల్లో విక్రయాలు జరిగాయని ఆరోపణ

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం ప్రకంపనలు కంచికచర్లను తాకాయి. ఈ ప్రాంతంలోని పలు బెల్టుషాపుల్లో నకిలీ మద్యం విక్రయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నారు. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మొత్తం ఎనిమిది మద్యం దుకాణాలున్నాయి. దుకాణాల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. వారి ఆధ్వర్యంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రెండు మండలాల్లో బెల్టు షాపులకు కొదవలేదు. ఒకవైపు సిండికేట్, మరోవైపు ఎక్సైజ్ అండతో బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ స్టిక్కర్‌ను తొలగించి, సిండికేట్లు ప్రత్యేకంగా తయారు చేయించిన స్టిక్కర్లు వేస్తుండటం విశేషం. సిండికేట్‌లో పనిచేసే ఓ వ్యక్తి, ఎక్సైజ్ స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే మరొకరు కలిసి నకిలీ మద్యం బెల్టు షాపులకు సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయి. సిండికేట్లకు కూడా తెలియకుండా వీరు ఇబ్రహీంపట్నం మండలం దొనబండ వద్ద ఒక ఫ్లైయాష్ ఇటుకల ప్లాంట్‌లో స్టాక్ పెట్టారని తెలిసింది. అక్కడి నుంచి ఎంపిక చేసిన బెల్టు షాపులకు సరఫరా చేశారని చెపుతున్నారు. కొద్దిరోజుల క్రితం గనిఆత్కూరు గ్రామంలో నకిలీ మద్యం వెలుగుచూసింది. ఎక్సైజ్ అధికారులు ఒత్తిళ్లకు లొంగి తూతూమంత్రంగా తనిఖీలు చేసి, చేతులు దులుపుకున్నారని సమాచారం. దీనికితోడు నకిలీమద్యం కేసులో ఏ1గా ఉన్న జనార్దన్ కంచికచర్లలోని ఓ దుకాణంలో వాటాదారుడని సమాచారం. కంచికచర్లలో కూడా నకిలీ మద్యం విక్రయించినట్టు ఆధారాలు లభించటంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు కొంతమంది బెల్టు షాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిసింది. స్థానిక ఎక్సైజ్ అధికారులను విజయవాడ పిలిపించి మద్యం దుకాణాలకు సంబంధించి రోజువారీ విక్రయాలు, స్టాకు ఇండెంట్ల వివరాలను పరిశీలిస్తున్నారు.



కేసీఎల్ స్టిక్కరు వేసిఉన్న మద్యం సీసాలు

నకిలీ కహానీలు!

(5వ పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. జనార్దనరావు నుంచి వారానికి 10-15 నకిలీ కేసులను కొనుగోలు చేసి వైన్స్‌లో విక్రయించాడు. ఇందులో వచ్చిన ఆదాయంలో సగభాగాన్ని కల్యాణ్ తీసుకున్నాడు. దీనికి సంబంధించిన ఆధారాలు లభించడంతో అధికారులు అతడికి సంకెళ్లు వేశారు. నకిలీ మద్యం కేసులో ఇప్పటి వరకు మొత్తం నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు.

'ఫుల్' పండగ

జనార్దనరావు నకిలీ మద్యాన్ని విక్రయించడంలో చాలా తెలివిగా వ్యవహరించాడు. మందు బాబులకు ఏమాత్రం అనుమానం రాకుండా, వారు చూసినా గుర్తు పట్టలేని విధంగా సరుకును చలామణి చేశారు. మొలకలచెరువులో నకిలీ యూనిట్ నడవడం మొదలుపెట్టిన తర్వాత ఇబ్రహీంపట్నంలో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మందుబాబులు ఎక్కువగా వచ్చి రద్దీగా ఉన్నప్పుడు నకిలీ మద్యం సీసాలు బయటకు వచ్చేవి. ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్‌లో మందు బాబులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు టేబుళ్ల మీద నకిలీ మద్యం సరుకు ప్రత్యక్షమయ్యేది. మంజీర, కేరళ, ఓల్డ్‌మ్యాన్షన్ వంటి నకిలీ బ్రాండ్లను మందుబాబులకు విక్రయించారు. ఏఎన్ఆర్, శ్రీనివాస వైన్స్‌లో ఇదే జరిగినట్టు తెలుస్తోంది. పైగా ఒడిశాకు చెందిన యువకులు ద్విపాత్రాభినయం చేసేవారు. జనార్దనరావు, సోదరుడు జగన్మోహనరావుకి సంబంధించి షాపుల్లో ఉద్యోగులుగా మారిపోయారు. ఒడిశాకు చెందిన బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లను జగన్మోహనరావుకు సంబంధించి కిరాణా షాపులో, జనార్దనరావు చెందిన ఏఎన్ఆర్ బార్‌లో ఉద్యోగులుగా అవకాశాలు ఇచ్చారు. నకిలీ మద్యం తయారీ, చలామణీలో కీలకంగా వ్యవహరిస్తే అధిక వేతనాలు ఇస్తామని మభ్యపెట్టారు. నకిలీ మద్యం విక్రయించిన జాబితాలో ప్రస్తుతం శ్రీనివాస వైన్స్ పేరు వెలుగులోకి వచ్చింది. ఇంకా కొన్ని మద్యం దుకాణాలకు ఈ లింక్‌లతో సంబంధం ఉందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాలి

» కపాస్ కిసాన్ యాప్‌పై పత్తి రైతుల విముఖత

» స్లాట్ బుకింగ్స్‌తో కొత్త సమస్యలు వస్తాయని ఆవేదన

» 15 నుంచి పత్తి కొనుగోళ్లకు సీసీఐ నిర్ణయం

» పకడ్బందీగా నిబంధనల అమలు



పత్తి బోరాలు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు వ్యతిరేకిస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతాయని, గతంలో మాదిరిగా సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని, పంట కొనాల్సిందిగా కోరుతున్నారు. నందిగామ డివిజన్ పరిధిలో ఈ ఏడాది 30 వేల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగుచేశారు. కొద్ది రోజుల్లో పత్తి తీతలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో ఎంపిక చేసిన 30 కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయాలని, భారత పత్తి సంస్థ (సీసీఐ) నిర్ణయించింది. ఈ ఏడాది దేశంలోనే మొదటిసారిగా పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఈ యాప్ ద్వారానే పత్తి కొనుగోళ్లు చేయాలన్న పట్టుదలతో సీసీఐ అధికారులు ఉన్నారు. పత్తి రైతులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పేరు, ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, పంటసాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలు నమోదు చేయాలని సూచించింది. తర్వాత పత్తి విక్రయాలకు యాప్ ద్వారానే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. ఈ సీజన్‌కు సంబంధించి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,110లు పొందేందుకు తప్పనిసరిగా ఈయాప్‌ను రైతులందరూ వినియోగించాలని సీసీఐ కోరుతున్నది. దీనివల్ల నిరీక్షించాల్సిన అవసరం ఉండదని, రైతులకు ముందుగా సమాచారం తెలుస్తుందని చెబుతోంది. అయితే ఈ యాప్‌ను వాడేందుకు రైతులు విముఖత చూపుతున్నారు. గతంలో సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు జరిగేవి. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీఎం యాప్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. స్లాట్ పద్ధతి గందరగోళంగా ఉంటుందని, తెలియని వారికి కొత్త సమస్యలు వస్తాయని రైతులు చెపుతున్నారు. రైతుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులు కూడా ఈ ఏడాది కపాస్ కిసాన్ యాప్ వద్దని, సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరపాల్సిందిగా సీసీఐను కోరారు. రెండు రోజుల క్రితం సీసీఐ ఇచ్చిన నోటిఫికేషన్‌లో కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొనగా, ఈ ఏడాది సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని ఉన్నతాధికారులు, స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులకు సమాచారం అందించారు.

నిబంధనలు పకడ్బందీగా అమలు

ఈ ఏడాది ముఖ్యంగా తేమకు సంబంధించి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సీసీఐ భావిస్తోంది. పత్తిలో తేమశాతం ఎనిమిది శాతానికి లోబడి ఉన్నట్టయితే మద్దతు ధర లభిస్తుంది. ఎనిమిది శాతానికి మించితే మద్దతు ధరలో ఒక శాతం వంతున ధర తగ్గిస్తుంది. తొమ్మిది శాతానికి రూ. 81.11లు, పది శాతానికి రూ.162.22లు, 11శాతానికి రూ243.33లు, 12శాతం ఉన్నట్లయితే రూ. 324.44లు వంతున ధరలో కోత పెడుతుంది. ఇక తేమ 12 శాతానికి మించి ఉన్నట్లయితే పత్తిని కొనుగోలు చేయదు. ఈ నిబంధనను పకడ్బందీ అమలు చేస్తామని సీసీఐ పేర్కొన్నది.

మూడు నెలలుగా జీతాల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో పనిచేసే 60 నుంచి 70 మందికి జీతాలను చెల్లించకుండా తొక్కిపెట్టారని ఉద్యోగులు చెబుతున్నారు. జీతాలు, ఇతరత్రా బిల్లులు చేసి కమిషనర్ వద్దకు సంబంధితశాఖ విభాగం సిబ్బంది తీసుకువెళితే వేలిముద్ర వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మునిసిపల్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. ఇటీవలి కాలంలో సచివాలయ సిబ్బంది పదోన్నతులు, డిమాండ్‌లు నెరవేర్చాలని యూనియన్ ద్వారా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో అధికారిక వాట్సాప్ గ్రూపు నుంచి కొందరు సచివాలయ సిబ్బంది నిష్క్రమించారు. తాము వాట్సాప్ గ్రూపు నుంచి వారంరోజుల క్రితం బయటకు వెళితే, గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా, వాట్సాప్ గ్రూపు నుంచి బయటకు వెళ్లడంతోనే మీకు జీతాలు నిలిపామనే సాకును చూపుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

జీతాలు పెండింగ్‌లో పెట్టడం నిజమే

-బాపిరాజు, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్

సచివాలయ సిబ్బంది కొందరు మునిసిపాలిటీకి చెందిన అధికారిక వాట్సాప్‌గ్రూపు నుంచి నిష్క్రమించారు. దీంతో పరిపాలనాపరంగా సమాచారం ఇచ్చిపుచ్చుకునే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాట్సాప్‌గ్రూపులో చేరితే జీతాలు, బిల్లులు చేస్తామని సిబ్బందికి చెప్పడం జరిగింది. కానీ వారు యూనియన్ నాయకుల సూచనల మేరకు వాట్సాప్ గ్రూపులో చేరలేదని చెబుతున్నారు. గతంలో సంతకాలు చేసిన బిల్లులు కొన్నింటికి ఇంకా అనుమతులు రాలేదు. పెండింగ్‌లోనే ఉన్నాయి.

గ్రావెల్ దొంగలు!

(5వ పేజీ తరువాయి)

అధికారులే చక్రం తిప్పారన్న చర్చ నడుస్తోంది. మెట్లపల్లి అటవీ ప్రాంతం వీరపనేనిగూడెం పరిశ్రమల ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. అప్పట్లో కంపెనీల అవసరాలకు పెద్ద ఎత్తున గ్రావెల్‌ను తరలించినట్టుగా తెలుస్తోంది. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలో అవసరం ఉన్న చోట డిమాండ్‌ను బట్టి విక్రయించినట్టుగా సమాచారం. చిన్న, మధ్య తరహా నాన్ లే అవుట్లకు కూడా ఇక్కడి నుంచే గ్రావెల్ అనధికారికంగా తరలివెళ్లిపోయినట్టుగా తెలుస్తోంది. అర్ధరాత్రుళ్లు భారీగా మెట్లపల్లి అడవిలో గ్రావెల్‌ను తవ్వుతున్నారన్న సమాచారంతో స్థానికులు నిఘా పెడుతుండటంతో అక్రమ తవ్వకాలు ఆగిపోయాయి.

జోగి రమేశ్‌పై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం ఏఎన్నార్ పాత బార్ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ అతడి అనుచరులపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ములకలచెరువు నకిలీ మద్యం ఆనవాళ్లు ఇబ్రహీంపట్నం ఏఎన్నార్ బార్ వద్ద లభించడంతో విచారణకు వచ్చామని, అక్కడ విధులు నిర్వహిస్తుండగా జోగి రమేశ్ అనుచరులతో వచ్చి తమ విధులకు ఆటంక పర్చడమే కాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయించారని ఈస్ట్ ఎక్సైజ్ అధికారి పెద్దిరాజు, టాక్స్‌ఫోర్స్ ఎస్ఐ వర్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జోగి అతడి అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కంకిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదపడుతుందని తెలుగుదేశం పార్టీ గ్రామాధ్యక్షులు చలసాని రాధాకృష్ణ అన్నారు. ప్రమాదంలో చేయి ఫ్రాక్చర్ అయిన ఇమ్మానుయేలుకు రూ. 51 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు. పడవల మధుసూదనరావు, టీడీపీ నాయకులు దండుగుల శ్రీను, ప్రసాద్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టిపెట్టాలి

కంకిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన ఆహారం, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని కంకిపాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉమాదేవి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలను బుధవారం కంకిపాడు పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ బెజవాడ దీప్తి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత గోగినేని మృతి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత గోగినేని శివరామకృష్ణ (60) బుధవారం మృతి చెందారు. వారం రోజులు కిందట బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాగా విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది తుది శ్వాస విడిచారు. టీడీపీ తొలి నాళ్లలో తెలుగు యువత విభాగం జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రియాశీలకంగా పనిచేసి సేవలు అందించారు. కొద్ది సంవత్సరాల కిందట హైదారబాద్‌లో స్థిరపడ్డారు.భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల 15 నెలల్లో కూటమి ప్రభుత్వ పాలన.. రాష్ట్ర అభివృద్ధిపై బుక్‌లెట్ తీసుకువచ్చారు. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలకు అందజేశారు. శుక్రవారం అంపాపురంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రధాన రోడ్ల అభివృద్ధికి రూ. 8 కోట్లు : ఎమ్మెల్యే బోడె

కంకిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ. 8 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, పెనమలూరు మండలంలోని గోసాల నుంచి కంకిపాడు మండల ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. 4 కోట్లు, ఈడుపుగల్లు నుంచి ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. 3 కోట్లు, ఉయ్యూరు మండలంలోని బోళ్లపాడు నుంచి కాటూరు వరకు ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. కోటి మంజూరు అయ్యాయని, ప్రధాన రహదారులను త్వరితగతిన అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

హెల్త్‌కేర్ స్టిక్స్ వినియోగంతో ఆరోగ్యం మీచెంతే

కానూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ కేర్ స్టిక్స్ వినియోగిస్తే ఆరోగ్యం మీచెంతే ఉంటుందని హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ నిపుణుడు, ఇండియన్ ఓం కేర్ కేంద్ర కార్యాలయం చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ చెప్పారు. లయన్స్ క్లబ్ చెన్నై ఆయుష్ ఆధ్వర్యంలో కానూరు అశోక్ నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో లయన్స్ వరల్డ్ సర్వీస్ డే ప్రాజెక్ట్‌లో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. హెల్త్ కేర్ స్టిక్స్‌ను మోదీ వినియోగించి ఫిట్‌నెస్ సాధించారన్నారు. చేతిలో ఉండే ప్రెషర్ పాయింట్స్‌ని ఈశక్ర ఒత్తిడి ఇవ్వడం ద్వారా ప్రాణశక్తి రిస్టోరేషన్ జరిగి ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. కార్యక్రమంలో కొండవీటి సుమతి, నాగమణి, విరల్, రియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.





అనుమోలు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. దావులూరులో స్వమిత్వ సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డీకే బాలాజీ

సమాజాభివృద్ధికి పాటుపడాలి

పీ-4 దాత అనుమోలు ప్రభాకరరావును అభినందించిన కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమంలో భాగస్వాములై అభివృద్ధి పనులు చేపడుతున్న మార్గదర్శుల కృషి అభినందనీయమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి అనుమోలు ఆదరణ ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు తన సొంత నిధులతో పోరంకి ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా దాతలు సమాజ అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. సామాజిక స్పృహతో ముందుకు వచ్చి పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాల పూర్తికి ఆర్థిక సహకారం అందించిన దాత అనుమోలు ప్రభాకరరావు కృషి అభినందనీయమని, అందుకు ప్రభుత్వం, విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. దీంతో పాటుగా ఆసుపత్రి నిర్మాణం, 21మంది పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారి అభివృద్ధికి శ్రద్ధ తీసుకొంటూ పీ-4 కార్యక్రమానికి మార్గదర్శిగా నిలిచారని, ఇతరులు ఆయనను ఆదర్శంగా తీసుకొని జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణానికి రూ.15 లక్షలను వెచ్చించి నిర్మాణాలను పూర్తి చేసి సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు అభినందనీయుడన్నారు. దీంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలో కళావేదికలను ఏర్పాటు చేశారని కొనియాడారు. అనుమోలు ప్రభాకరరావు దంపతులను కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, మండల తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో ప్రణవి, హెచ్ఎం సుమలత, ఎంఈవోలు కనకమహాలక్ష్మి, శేషగిరిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, యువనేత బోడె వెంకట్రామ్, చెన్నుపాటి శ్రీనివాస్, టీడీపీ మహిళా నేతలు పాల్గొన్నారు.

సర్వే సమయంలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా?

● లబ్ధిదారులతో ఫోన్‌లో కలెక్టర్ బాలాజీ ఆరా

పెనమలూరు : సర్వే కోసం అర్జీలు దాఖలు చేసిన లబ్ధిదారులను సంబంధిత సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా అని కలెక్టర్ లబ్ధిదారులకు స్వయంగా ఫోన్ చేసి ఆరా తీశారు. కలెక్టర్ ఉదయం పోరంకి ఉన్నత పాఠశాలలో తరగతి గదులు ప్రారంభించిన తర్వాత దావులూరుకు వెళ్లి స్వమిత్వ సర్వే పరిశీలించి సాయంత్రం పోరంకిలోని మూడవ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలోని సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇళ్ల స్థలాలను సర్వే చేయాలని గతంలో లబ్ధిదారులు దాఖలు చేసుకొన్న దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ నేరుగా లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడారు. సర్వేయర్లు వచ్చి మీ భూమిని సర్వే చేశారా...సర్వేకు ముందు నోటీసు లేదా ఫోన్ ద్వారా తెలియజేశారా...సర్వే సమయంలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా వంటి విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్‌తో పాటు ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్, మునిసిపల్ కమిషనర్ నజీర్, తహశీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో ప్రణవి ఉన్నారు.

స్వమిత్వ సర్వే 90శాతం పూర్తి

కంకిపాడు : స్వమిత్వ సర్వేను 90శాతం పూర్తి చేసిన దావులూరు పంచాయతీ అధికారులు, సిబ్బందిని మిగిలిన గ్రామాల అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. మండలంలోని దావులూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వేను బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వమిత్వ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రామాల వారీగా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 90శాతం సర్వే పూర్తి చేసిన అధికారులను ఆయన అభినందించారు. మిగిలిన గ్రామాల అధికారులు కూడా దావులూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మార్గమధ్యలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో బీ.ఎస్ హేలా షారోన్, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష పాల్గొన్నారు.

ధనేకులలో హ్యాండ్స్ ఆన్ ఎలక్ట్రికల్ వర్క్‌షాప్

పెనమలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ఈ అండ్ ఈ విభాగం, నియాన్ మహీంద్ర సహకారంతో రెండు రోజుల హ్యాండ్స్ ఆన్ ఎలక్ట్రికల్ వెహికిల్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల డైట్-ఆర్ఎస్ఈవీ క్లబ్‌ను విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎలక్ట్రికల్ వాహనాల రూపకల్పన, పవర్‌ట్రెయిన్ సిస్టమ్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, ఛార్జింగ్ టెక్నాలజీ లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమలో జరిగే నూతన మార్పులను తెలుసుకొని తమనైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. గ్లోబల్ మార్కెట్‌లో ఈవీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని భవిష్యత్తులో ఈ రంగంలో మరిన్ని ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. డైరెక్టర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కరస్పాండెంటు ధనేకుల భవానీ ప్రసాద్ కరస్పాండెంటు తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పందిపాటి ఇందిర,

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

కంకిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరి శుభ్రంగా ఉంచడంలో శ్రమిస్తున్న పారిశుధ్య సిబ్బంది సేవ లను ప్రతిఒక్కరూ గుర్తించాల్సిన అవసరముందని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి బుధవారం ఆమె దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందిర మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరికంటే ముందుగా లేచి చీపిరి పట్టే పారిశుధ్య సిబ్బంది సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. చెత్త రహిత గ్రామం గా ఈడుపుగల్లు గ్రామాన్ని తీర్చిదిద్దడంలో కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ విశేషంగా కృషి చేస్తున్నారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

కమ్మవారి సేవా సమితి సేవలు ఆదర్శం

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పెనమలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరులో నిర్వహిస్తున్న కమ్మవారి సేవాసమితి సేవలు ఆదర్శవంతమైనవని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పెనమలూరులోని కమ్మవారి సేవా సమితి-గ్రేటర్ విజయవాడ శ్రీమతి కిలారు విశాలాక్షి స్మారక విద్యాలయ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరికంలో మునిగిపోయి చదువుకోలేని విద్యార్థినులకు అవకాశాలు కల్పిస్తున్న కమ్మవారి సేవా సమితి సేవలు అద్భుతమన్నారు. ప్రభుత్వ సాయం లేకుండా దాతల ఔదార్యంతో మూడువేల మంది విద్యార్థినులకు భవిష్యత్తులో అవకాశాలు కల్పించేలా తీర్చిదిద్దే లక్ష్యం గర్వకారణమని కొనియాడారు. సంస్థలో పనిచేస్తున్న తాతినేని విద్యాసాగర్ సేవలను ప్రస్తావిస్తూ యూనియన్ బ్యాంకు, మార్క్‌ఫెడ్ తదితర సంస్థల్లో పనిచేసిన అనుభవంతో ఇక్కడ హెచ్‌ఆర్‌గా సేవలందిస్తున్న ఆయన అభినందనీయుడన్నారు. ప్రతి ఏడాది కనీసం పదిహేను మంది విద్యార్థినులు ఐఐటీలకు ఎంపికవడం గర్వకారణమన్నారు. స్వర్గీయ దేవినేని వెంకటరమణ ప్రణీత మెమోరియల్ ట్రస్టు తరపున ఐదు లక్షల విరాళాన్ని దేవినేని ఉమా వసతి గృహానికి అందజేశారు.

విద్యార్థి విజ్ఞాన్‌మంతన్ పోటీ పరీక్షల గడువు పొడిగింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే శాస్త్రసాంకేతిక రంగాల్లో అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నిర్వహించే పోటీ పరీక్షల గడువును ఈ నెల 10వ తేదీ వరకూ పొడిగించినట్లు విద్యార్థి విజ్ఞాన్ మంతన్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రగతి తెలిపారు. వీరవల్లి హైస్కూల్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ, ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 440మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వేలేరు జవహర్ నవోదయ విద్యాలయకు చెందిన విద్యార్థులు 150 మంది, గన్నవరం సెయింట్ జాన్స్ నుంచి 136మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసినట్లు వివరించారు. మరో రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ జగతి కోరారు.



కాటూరులో తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై సురేశ్‌బాబు

బాణసంచా నిల్వచేస్తే చర్యలు

ఉయ్యూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు, జాగ్రత్తలు పాటించకుండా బాణసంచా నిల్వచేసినా, అమ్మినా, కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు హెచ్చరించారు. ఉయ్యూరులో అక్రమ బాణసంచా నిల్వలకోసం బుధవారం పలు దుఖాణాలు, గోదాములను సీఐ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎటువంటి మందుగుండు సామాగ్రి దొరకలేదని తెలిపారు.

● రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎస్సై సురేశ్‌బాబు తనిఖీ చేశారు. కాటూరు, కలవపాముల, ముదునూరు, ఆకునూరు, పెదఓగిరాల గ్రామాల్లో బాణాసంచా అమ్మే దుఖాణాలు, గోదాములు తనిఖీచేశారు. నిబంధనలు ఉల్లఘించి మందుగుండు సామాగ్రి అమ్మినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

251 మంది మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులు పాటు నిర్వహించిన మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవాం౦ం ముగిసాయి. బాలబాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కలిపి మండల స్థాయిలో 251 మందిని ఎంపిక చేసినట్లు మండల క్రీడల ఇంచార్జి ఎస్, రామచంద్రుడు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన పోటీల్లో 300 మంది బాలురు పాల్గొనగా అందులో 150 మందిని ఎంపిక చేశారు. బుధవారం బాలికలకు నిర్వహించిన పోటీల్లో 250 మంది పాల్గొనగా 101 మందిని ఎంపికచేసినట్లు తెలిపారు. గుడివాడ డివిజన్ స్థాయిలో త్వరలో నిర్వహించనున్న ఆటల పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.



మండలస్థాయిలో ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఉంగుటూరు : చదువుతోపాటు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక ఆటల పోటీలు రెండవ రోజైన బుధవారం ఉత్సాహంగా సాగాయి. ఈ ఆటల పోటీలకు మండలంలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.రాంబాబు, మండల కో-ఆర్డినేటర్ ఎస్.క్రాంతి పర్యవేక్షణలో అండర్-14, 17విభాగాల్లో బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. సర్పంచ్ కాటూరి వరప్రసాద్, ఎంఈవో-2 జె.సాంబశివరావు, ఎస్ఎంసీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, హెచ్ఎం చేరగుడి అనిత పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి క్రీడాపోటీలు

ఉయ్యూరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. అండ ర్-17, అండర్-14 బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల మైదానంలో నిర్వహించారు. స్పోర్ట్స్, అథ్లెటిక్స్‌లో ఎంపికైన బాల బాలికలు త్వరలో జరి గే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల, డివిజన్ కోఆర్డినేటర్ కె.బాలస్వామి తెలిపారు.





ఉయ్యూరులో రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు.. ఉంగుటూరులో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సరోజిని



రెజ్లింగ్ పోటీల్లో విజయం సాధించిన శ్రీశ్రీనివాస విద్యార్థులు

రెజ్లింగ్‌లో శ్రీశ్రీనివాస విద్యార్థుల విజయం

ఉయ్యూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శ్రీశ్రీనివాస అక్షరాలయం విద్యార్థులు ఘనవిజయం సాధించారు. నున్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన పోటీల్లో అండర్ -17, 71 కిలోల విభాగంలో వి. హరిఉదయ్‌కృష్ణ మొదటి స్థానం సాధించగా, అండర్ -14, 58 కిలలో విభాగంలో ఎం.కుసుమ విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల అధినేతలు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ తెలిపారు.

పీఏసీఎస్ సభ్యురాలి కుటుంబానికి ఆర్థికసాయం



హనువాన్ జంక్షన్‌రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : రైతు కుటుంబాలకు అండగా ఉంటూ అన్ని విధాల సహకారం అందించేందుకు పీఏసీఎస్ కృషి చేయాలని ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. కోడూరుపాడుకు చెందిన కొంద్రు శిలువమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో మట్టిఖర్చులకు పీఏసీఎస్ నుంచి ఆర్థికసాయాన్ని బుధవారం కుటుంబసభ్యులకు అందజేశారు.

స్క్రీన్లతో చూపు చీకట్లోకి..!



సమయానికి గుర్తించకపోవడంతో అధిక తీవ్రత ● ఆహారపు అలవాట్లలో మార్పు ఒక కారణం ● ఫోన్లతో పిల్లల్లో దూరమవుతున్న సృజనాత్మకత

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

పంచేద్రియాల్లో ముఖ్యమైన వాటిలో కళ్లు ఒకటి. ఇవి చాలా సున్నితమైనవి. ఒకప్పుడు ముదిమి వయసు వచ్చినప్పటికీ కళ్లు స్పష్టంగా కనిపించేవి. కానీ నేటి తరం పిల్లల్లో పట్టుమని పదేళ్లు నిండకముందే కళ్లకు అద్దాలు పడుతున్నాయి. నాడు పలక బలపం పట్టిన బాల్యం నేడు స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్ లు గంటల తరబడి చూడడంతో కంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. చిన్నారులు ఫోన్ చూస్తున్నప్పుడు కళ్లకు దగ్గరగా పెట్టుకుని చూడడమే వల్లే దృష్టి లోపానికి కారణమని వైద్యనిపుణులు చెబుతున్నారు. మారి న ఆహారపు అలవాట్లు, కంటికి స్క్రీన్‌కు మధ్య కనీస దూరం పాటించకపోవడం వల్లే పిల్లల్లో దృష్టిలోపం ఏర్పడుతోంది. స్మార్ట్ ఫోన్లు వచ్చినప్పటి నుంచి పెద్దలతో పాటు పిల్లల్లోనూ సృజనాత్మకత లోపిస్తుంది. ఏ విషయం తెలుసుకోవాలన్నా పుస్తకాలను వెతకడం మానేసి ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారు. దీంతో నేటితరం పిల్లలు, యువతలో ఆలోచించే తత్వంతో పాటు విషయజ్ఞానమూ తగ్గుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా 6 నుంచి పదహారేళ్లలోపు చిన్నారుల్లో ఈ సమస్యలు అధికంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి - విజయవాడ

జీజీహెచ్‌కు నెలకు సుమారు 2వేల నుంచి 2,200 ఓపీలు సేవలు నమోదవుతున్నాయి. వీరిలో అధికంగా చిన్నపిల్లలు, యుక్తవయస్కులుండడం ఆందోళన కలిగించే అంశం. నెలలో కనీసం 130 నుంచి 150 వరకు మేజర్, 135 వరకు మైనర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఎక్కువ సమయం ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను చూడడం వల్లే ఈ సమస్యలు ఏర్పడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు ఎక్కువ సమయం చూడడంతో కళ్లపై ఒత్తిడి పడి కళ్లమంట, తర్వాత పొడిబారిపోతాయి. ఆ సమయంలోనైనా గుర్తించి ఫోన్ చూడడం మానకపోయినా, వైద్యులను సంప్రదించపోయినా కళ్లు మసకబారడంతో పాటు దృష్టిలోపం ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు.



దృష్టిలోపానికి కారణాలు

కంటిని ఎక్కువగా నలపడం వల్ల కన్ను గుడ్డు ముందుకు (వీ ఆకారంలో) పొడుచుకు రావడం వల్ల కూడా దృష్టిలోపానికి ఒక కారణమని వైద్యులు చెబుతున్నారు. కన్ను దురద పుట్టినప్పుడు, ఇతర కారణాలతో అదేపనిగా కంటిని నలపడం వల్ల కర్వేచర్ (కంటిలోని నల్లగుడ్డు) ఆకారం కోనికల్ షేప్‌లోకి మారిపోతుంది. దీంతో నల్లగుడ్డులోని రెండు పొరల మధ్య వ్యత్యాసం పెరిగిపోయి దృష్టిలోపం ఏర్పడుతుంది. దీనికి లాసిక్ సర్జరీ చేసి లేజర్ కిరణాలతో వాటి మధ్య అంతరాన్ని తగ్గించి దృష్టి లోపాన్ని సరిచేస్తారు. అలాగే కంటికి వచ్చే అనేక రకాల వ్యాధుల వల్ల చూపు మందగిస్తుంది. శుక్లాల (కాంటాక్ట్- కంటి చివరన గడ్డలు ఏర్పడడం), నీటి కాసులు (గ్లకోమా-కంటిలోని నరాలు దెబ్బతిడం) వల్ల దృష్టిలోపం ఏర్పడుతుంది. గ్లకోమా వచ్చాక కొద్దికొద్దిగా చూపు మందగించి మొత్తం చూపు కోల్పోయే ప్రమాదముంది. కంటిలో ఉండే రెటీనా ఫిల్మ్‌లా పనిచేస్తుంది. కంటిలోకి వచ్చే కాంతిని తీసుకుని ఆ సిగ్నల్స్‌ను నరాల ద్వారా మెదడుకు చేరవేస్తుంది. మధుమేహం ఎక్కువగా ఉన్నా రెటీనా రక్తనాళాలు దెబ్బతిని చూపు మందగిస్తుంది. కంటిపొర (టెరీజియం- కన్నుగుడ్డుపై ఉండే పలచనిపొర)కు దెబ్బతగిలితే నల్లగా ఉన్న కనుగుడ్డు తెల్లగామారిచూపు కోల్పోతారు. ఈ పొరను మార్చడం వల్ల చూపు తిరిగిపొందవచ్చని వైద్యులు వెల్లడించారు. రిఫ్రాక్టివ్ ఎర్రర్ (కాంతి తరంగాలు రెటీనాపై సరిగా పడకపోవడం) వల్ల మయోపియా (దూరంగా ఉన్న వస్తువులు మసకగా కనపడడం), హైపరోపియా (దగ్గర వస్తువులు మసకగా కనిపించడం) సమస్యలు వస్తాయి. కార్నియల్ బ్లైండ్‌నెస్ (కంటిముందు భాగంలో ఉండే గాజులాంటి పొర మసకబారడం) సమస్య వల్ల కూడా దృష్టిలోపం ఏర్పడుతోంది. కొన్ని రకాల దృష్టిలోపాలు వయసు పెరిగే కొద్దీ, ఇతర వ్యాధులతో వచ్చినప్పటికీ, పిల్లల్లో మాత్రం ఫోన్లు, ట్యాబ్‌ల వల్లే వస్తాయని నిపుణులు చెబుతున్నారు. చాలా తక్కువ మంది పోషకాహారం లోపంతో దృష్టిలోపంతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. విటమిన్-ఏ లోపం వల్ల కన్ను డ్రై అవడం, నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడడం వంటి సమస్యలతో అధికాశాతం మంది పిల్లలు ఆసుపత్రికి వస్తున్నట్టు వైద్యులు తెలిపారు. విటమిన్ లోపం అధికంగా ఉంటే కన్ను డ్రై అయిపోయి చూపుపోయే ప్రమాదముందని, విటమిన్‌లోపం రేచీకటి సమస్యకు దారితీస్తుందన్నారు.



చిన్నారులకు ఫోను అలవాటు ప్రమాదం.. సత్యనారాయణ ఆప్తమాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్

నేటితరం యువతలో 20ఏళ్ల నిండక ముందే దృష్టిలోపం ఏర్పడుతోంది. దీనికి ప్రధానకారణం ఫోన్లు, ట్యాబ్‌లు ఎక్కువగా చూడడమే. స్క్రీన్‌లను దగ్గరగా చూడడం వల్ల కళ్లు మంటపుట్టడం, క్రమంగా డ్రై అయిపోయి మసకబారిపోతాయి.

కళ్లు మసకబారిన విషయం పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకపోవడం, విషయం తెలిసిన తర్వాత వైద్యులను సంప్రదించినప్పటికీ తీవ్రత పెరిగిపోతోంది. దీంతో సాధారణం కంటే ఎక్కువస్థాయి దృష్టిలోపానికి సంబంధించిన కళ్లద్దాలు ఇవ్వకతప్పడం లేదు. అలాగే చిన్నారుల్లో విటమిన్ లోపం ఎక్కువగా ఉంటోంది. ఏ-విటమిన్ అందాలంటే క్యారెట్, జామ, యాపిల్ పండ్లు తీసుకోవాలి. నేత్రదానమంటే కళ్లు తీసి పట్టుకెళ్తారేమోనని గ్రామాల్లో ఒక అపోహ ఉంది. కానీ కంటిపై పొర (కార్నియా)ను మాత్రమే తొలగిస్తారని చెప్పి అవగాహన కల్పిస్తున్నాం. దేశవ్యాప్తంగా 2 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారు. ప్రతిరోజు వేలమంది చనిపోతున్నారు. వారి కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు వస్తే దేశంలో చూపులేని వారి శాతం తగ్గుతుంది.



కొరమీను చేపల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

కొరమీను చేపల సాగుతో రైతులకు అదనపు ఆదాయం

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

కూచిపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతోపాటు అనుబంధంగా కొరమీను చేపల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామానికి చెందిన చిట్టూరి కస్తూరిబాయి 10 సెంట్ల స్థలంలో చేపట్టిన కొరమీను సాగును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తను తయారు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం జీవనోపాధులను మెరుగుపర్చేలా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కొరమీను చేపల సాగును చేపట్టేందుకు ప్రభుత్వం రుణాలను అందించి రైతులను ప్రోత్సహిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. తక్కువ స్థలంలోనూ పెంపకం చేపట్టవచ్చునని, మార్కెట్‌లో కొరమీనుకు మంచి డిమాండ్ ఉండటంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉదయ్ ఆక్వా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని, అవసరమైన సీడ్‌తోపాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రొగ్రామ్ పథకం కింద 10 సెంట్ల స్థలంలో చెరువును తవ్వి సాగు చేపట్టేందుకు రూ.4.40 లక్షల రుణాన్ని ప్రభుత్వం అందించటంతోపాటు 35 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోతే ఉదయ్ ఆక్వా కంపెనీయే మద్దతు ధర ఇచ్చి చేపలు కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ హరనాథ్, తహసీల్దార్ మస్తాన్, ఎండీవో డీ సుహాసిని, ఎంపీపీ కే ఇందిర, సర్పంచ్ కొమ్ము సౌదామణి, ఎంపీటీసీ గారపాటి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు దేశ చరిత్రలోనే విప్లవాత్మక నిర్ణయం

● మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అవనిగడ్డ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు దేశ చరిత్రలోనే విప్లవాత్మక నిర్ణయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అవనిగడ్డ రెవెన్యూ హాలులో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాలు దేశ ప్రజలకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించి పేద, మధ్య తరగతి వర్గాల, రైతులు కొనుగోలు శక్తి, పొదుపు గణనీయంగా పెంచాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకుల ధరలు, వ్యవసాయ పనిముట్ల రేట్లు తగ్గాయన్నారు. ఈ నెల 16న జీఎస్టీ అవగాహన సదస్సుకు రాష్ట్రానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేయనున్నట్లు తెలిపారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ ప్రకారం ధరల వివరాల బోర్డులు ఖచ్చితంగా దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని సూచించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. నేతలు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నేతలు కన్నా నాగరాజు, జీవీ నగరాయులు, టీవీ గిరి, పైడిపాముల కృష్ణకుమారి, పైడిపముల స్వప్న, రాజనాల వీరబాబు, మర్రె గంగయ్య, పూషడపు రత్నగోపాల్, కొండవీటి సునీత, ఉప్పల ప్రసాద్, రేపల్లె రవీంద్ర, బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, గుడిసేవ సూర్యనారాయణ, మండలి రామ్మోహనరావు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పశువుల హాస్టళ్లు

మచిలీపట్నం టౌన్: త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పశువుల హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, ఇందుకోసం భూముల కేటాయింపు, నిధుల విడుదల త్వరలోనే జరుగుతాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన గోశాలను సందర్శించి, విధి విధానాలపై చర్చించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువుల నియంత్రణకు ఆగస్టులో పశువుల శాల ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 326 పశువులను పశుశాలలో ఉంచగా, వాటిలో 269 పశువులను యజమానులు రుసుము చెల్లించి తిరిగి తీసుకెళ్లారన్నారు. మంత్రి వెంట మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సహాయ మునిసిపల్ కమిషనర్ గోపాలరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, టీడీపీ నేతలు గొర్రెపాటి గోపీచంద్, లంకే నారాయణ ప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, కోస్తా మురళి పాల్గొన్నారు.



ఎంపీడీవోలు, డ్వామా పీడీలతో కలెక్టర్ లక్ష్మీశ వీడియో కాన్ఫరెన్స్

ఉపాధి హామీలో ముఖ ఆధారిత హాజరు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచేందుకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసేందుకు వేతనదారుల ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆధార్ డేటా, ఈ కేవైసీతో ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు పథకం అమల్లో పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సంబంధించిన ఫేస్ - ఆర్‌డీ అండ్ ఎన్ఎంఎంఎస్ యాప్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు డౌన్‌లోడ్ చేసుకొనేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చూస్తే సగటు వేతనం విషయంలో గంపలగూడెం, కంచికచర్ల, జగ్గయ్యపేట మండలాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని, ప్రతి మండలం ఈ విషయంలో ప్రగతి చూపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 2025-26లో 4వేల ఎకరాల ఉద్యానపంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 3,745 ఎకరాలను గుర్తించినట్టు తెలిపారు. మునగ సాగుకు 880 ఎకరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే సీసీ రోడ్డు, పశువుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లపై చర్చించి సూచనలు చేశారు. డ్వామా పీడీ ఏ రాము పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాకు స్కెచ్..!

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పగడ్బందీ స్కెచ్ వేశారు ఆ ఇద్దరు. వీరిలో 'ఒకరికి' కృష్ణలంక నెహ్రూనగర్ డొంకరోడ్డులో రేషన్ డిపో ఉంది. 'ఇంకొకరు' మాత్రం రేషన్ డీలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి దళారులకు విక్రయిస్తూ ఉంటాడు. వీరిద్దరు కలవడంతో రేషన్ డీలర్లలో వణుకు ప్రారంభమైంది. కారణం తమ వెనుక సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల అండదండలున్నాయంటూ ప్రగల్భాలు పలకడమే. కృష్ణలంక స్వర్గపురి రోడ్డు నుంచి రామలింగేశ్వరనగర్ వరకు ఉన్న రేషన్ డిపో డీలర్లతో వీరిద్దరూ సమావేశం ఏర్పాటు చేసి మీ షాపుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తమకే ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. డీలర్ల నుంచి వారు బియ్యాన్ని కిలోకు రూ.17 చొప్పున చెల్లించి తీసుకెళ్తున్నారు. ఈ బియ్యాన్నంతా పోగుచేసి ఓ గోడౌన్‌లో స్టోర్ చేసి పెనమలూరుకు చెందిన బియ్యం దళారికి కిలోకు రూ.20 లాభానికి విక్రయిస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయ మే. అక్కడి నుంచి కాకినాడ పోర్టుకు బియ్యం తరలిపోతోంది. అయితే డీలర్లందరూ తమకే బియ్యాన్ని ఇవ్వాలంటూ వీరు హుకుం జారీ చేయడంతో డీలర్లకేం చేయాలో పాలుపోలేదు. 'అధికారుల సంగతి మేం చూసు కొంటాం' అంటూ ప్రగల్భాలు పలకడం చూ స్తుంటే నిజంగానే వీరి వెనుక అధికారుల అం డదండలున్నాయా అన్న అనుమానాలు కలగక మానడం లేదని కొందరు వాపోతున్నారు.

పిచ్చి వేషాలు వేస్తే తాట తీస్తా: ఏఎస్‌వో

డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పిచ్చివేషాలు వేస్తే తాట తీస్తానని ఏఎస్‌వో శ్రీనివాస్ డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణలంకలోని దాదాపు 25 మంది డీలర్లకు మెమోల జారీతో పాటు 'ఇంకొకరికి' మాత్రం షోకాజ్ నోటీసు జారీ చేశారు. రేషన్ బియ్యంలో అక్రమాలు, తరలింపులు జరిగినట్టు తేలితే అందరినీ ఇంటికి పంపించేస్తామని, ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు.



డీలర్ ఆంజనేయులు డిపో నుంచి పట్టుకొన్న వాహనంలో రేషన్ బియ్యం

డిపో నుంచి వెళ్తున్న బియ్యం పట్టివేత

కృష్ణలంక నెహ్రూనగర్ డొంకరోడ్డులోని రేషన్ డిపో నెం 301 డీలర్ ఏ ఆంజనేయులు డిపో నుంచి మంగళవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో మినీ లారీలో తరలివెళ్తున్న బియ్యాన్ని పోలీసులకు పట్టుకొన్నారు. అప్పటికే ఆంజనేయులు జంప్ కావడంతో పోలీసులు వాహనాన్ని కృష్ణలంక స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌వో అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్టేషన్‌కు వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. ఆంజనేయులు, డ్రైవర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తమకిస్తే తాము 6ఏ కింద జా యింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేస్తామని పోలీసులకు చెప్పినట్టు ఏఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యం 50 కిలోల బస్తాలు దాదాపు 60 వరకు ఉండొచ్చని తెలిసింది. కంకిపాడుకు చెందిన ఓ దళారి బొలేరో వాహనం ఇచ్చి ఆంజనేయులు డిపో నుంచి బియ్యాన్ని తెమ్మని ఓ వ్యక్తిని పంపినట్టు సమాచారం. డిపోకు ఆంజనేయులు వేసిన తాళంపై తాను మరో తాళం వేసినట్టు ఏఎస్‌వో తెలిపారు.

సుబ్బారాయుడి సన్నిధిలో మంత్రి రవీంద్ర



మోపిదేవి: మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని బుధవారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందజేశారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

నూతన పింఛన్లు, డయేరియా అంశాలపై అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం







కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, టీడీపీ ఫ్లోర్ లీడర్

కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. నూతన పింఛన్ల అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని వైసీపీ కార్పొరేటర్ మొహమ్మద్ రెహానా ప్రస్తావించగా టీడీపీ కార్పొరేటర్లు ప్రతిఘటించారు. దీంతో ఇరువర్గాలకు మాటల యుద్ధం జరిగింది. బుడమేరు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోలేదని, బాధితులకు నష్టం పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం మోసగించిందని అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆరోపించగా టీడీపీ కార్పొరేటర్లు ప్రతి ఒక్కరికి నష్టపరిహారంతోపాటు బుడమేరు గండిపడిన చోట రూ.29 కోట్లతో వాల్ నిర్మాణం చేశామన్నారు. టీడీపీ కార్పొరేటర్లు సూపర్ సిక్స్ పథకాలతో ప్రభుత్వం దూసుకుపోతుందని చెప్పగా వైసీపీ కార్పొరేటర్లు సూపర్ సిక్స్ ఫెయిల్యూర్ అంటూ నినాదాలు చేశారు. కొత్త రాజరాజేశ్వరిపేటలో డయేరియా ఎందుకు వచ్చిందంటే ఒక్క అధికారి కానీ ప్రజా ప్రతినిధులు కానీ చెప్పలేదని వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తావించగా కమిషనర్ స్పందించారు. ఆ ఏరియాలో వీఎంసీ అందిస్తున్న మంచినీటికి పలుమార్లు పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చిందని, అక్కడున్న 4 ఆర్వో ప్లాంట్లలో మంచినీటిని పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చిందని, ఆ నీటిలో ఇకోలై అనే బ్యాక్టీరియా ఉందని దానివల్లే డయేరియా వచ్చిందని, వినాయక చవితి రోజు ఆ 4 వాటర్ ప్లాంట్ల నీటిని వినియోగించినట్లు తెలిసిందని కమిషనర్ సభకు తెలిపారు. నగరంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నిర్మించిన కల్యాణ మండపాల్లో సచివాలయాలు ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, కల్యాణమండపాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండటం లేదని పలువురు కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకురాగా ఆమె వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, సచివాలయాలు వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, కుక్కల దాడులతో ప్రజలు గాయాలు పడుతున్నారని సుప్రీంకోర్టు ఆదేశాలంటూ ప్రజల ప్రాణాలతో అడుకుంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు.

సహనం కోల్పోయిన మేయర్...

సభను సక్రమంగా నడపాల్సిన మేయర్ బుడమేరు, పింఛన్ల విషయంలో సహనం కోల్పోయి మేయర్ అన్న సంగతి మరిచి టీడీపీ కార్పొరేటర్లపై ఎదురుదాడికి దిగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఆరు నెలలకు నూతన పింఛన్‌లు ఇచ్చారని, టీడీపీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని నా డివిజన్‌లో వృద్ధాప్య పింఛన్లు తొలగించారని టీడీపీ కార్పొరేటర్లపై ఎదురుదాడి చేశారు. అధికారులు పింఛన్లు తీయలేదని చెబుతున్నా వినకుండా వారిపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో అవకతవకలు

టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి

నగరంలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఒకే విధానం అవలంబించాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్ బాలస్వామి అన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ జారీ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, అధిక మొత్తం డబ్బులు వసూలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణ మండపాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, కంట్రోలర్ రూమ్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ పార్కులో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదన పెట్టగా ప్రత్యేక కమిటీకి పంపించడం సరికాదన్నారు. నగరంలోని పార్కుల్లో సెక్యూరిటీ సిబ్బందితోపాటు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.

నగరంలో రోడ్ల నిర్వహణ ప్రైవేటీకరణ ఆపాలి

సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

నగరంలో రోడ్ల నిర్వహణ ప్రైవేటీకరణ ఆపాలి, బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు అన్నారు. కౌన్సిల్ సమావేశానికి ముందు బ్యానర్ చేతబూని నినాదాలు చేసుకుంటూ కౌన్సిల్ సమావేశానికి వచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకుండా నగరాభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్లు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

గుడివాడ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్‌లోని అర్బన్ పాఠశాలల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయనున్నామని ఎంఈవో బాలాజీ అన్నారు. బుధవారం మాంటిస్సోరి పాఠశాలలో పాఠ్యపుస్తకాలను ఎంఈవో ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులందరికీ ఉచితంగా రెండవ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 76 పాఠశాలలకు సుమారు 7400 మందికి పంపిణీ చేశామన్నారు. విద్యార్థి పుస్తకాలను చక్కగా ఉంచుకోవాలని కోరారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు.


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో బాలాజీ

అర్హులకు సొంతింటి కలను నిజం చేద్దాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణాలపై అధికారులు దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజా వేదికలో గృహనిర్మాణ శాఖ అధికారులతో త్వరలో చేపట్టనున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిర్మాణాలపై ఎమ్మెల్యే వెనిగండ్ల సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏవై విధి విధానాలు పూర్తిస్థాయిలో వచ్చిన తరువాత గుడివాడ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యటనలు చేపట్టాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ పథకానికి దరఖాస్తులు చేసుకునేలా గృహనిర్మాణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ డీఈఈ శివప్రసాద్, ఏఈలు సురేంద్ర, సాయిపవన్, పృథ్వి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల


అవగాహన కలిగిస్తున్న టూటౌన్ సీఐ హరీష్

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన అవసరం

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : బాలబాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి, పోక్సో యాక్టు గురించి అవగాహన కలిగి ఉండాలని టూటౌన్ సీఐ జేఆర్‌కే హరీష్ తెలిపారు. బుధవారం స్థానిక ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని, 112 కాల్‌కు సమాచారం అందించాలని సీఐ హరీష్ తెలిపారు. టూటౌన్ ఎస్సై పి.లోవరాజు, వి.జాస్మిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో అన్నదానం

నందివాడ : దసరా నవరాత్రుల్లో భాగంగా తమిరిశలో మిల్లు వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గాదేవి ఆలయంలో మిల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన కార్యక్రమంలో రూరల్ సీఐ సోమేశ్వరరావు, నందివాడ ఎస్సై కె.శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మిల్లు శ్రీనివాసరావు , కమిటీ సభ్యులు ఎస్సై శ్రీనివాసరావుకు, సీఐ ఐసోమేశ్వరరావును దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. 2 వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్లు మిల్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగయ్య, ప్రసాద్, దుర్గారావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


డివిజన్ స్థాయికి ఎంపికైన తమిరిశ పాఠశాల విద్యార్థులు

తమిరిశ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నందివాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందివాడలో 7వ తేదీ మంగళవారం అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో తమిరిశ జిల్లా పరిషత్ విద్యార్థులు 27 మంది డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమిరిశ పాఠశాల ఏఎంసీ చైర్మన్ తోట నాగరాజు క్రీడాకారుల దుస్తుల కోసం రూ.5 వేల నగదును ఎంపికైన విద్యార్థులకు అందించి అభినందనలు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

కూచిపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని చినముత్తేవి గ్రామస్థులు కలెక్టర్ డికె.బాలాజీని కోరారు. చినముత్తేవి గ్రామానికి బుధవారం విచ్చేసిన గ్రామస్థులు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూఖ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గత ఆరు సంవత్సరాల నుంచి ఇంళ్ల స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కాపురాలు చేస్తూ అద్దె ఇంటిలో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పేదలకు గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలిచ్చి స్థలాలు చూపించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తానని ప్రభుత్వం ప్రకటించి 16 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఒక్కరికీ ఇళ్ల స్థలం ఇవ్వలేదని, తమ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. గత రెండు సంవత్సరాలుగా కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గ్రామంలో అయినంపూడి డ్రెయినేజీపై శిథిలమైన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ త్వరలో మీరు ఇచ్చిన సమస్యలపై పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి మాదాసు నాగులు, సభ్యులు నాగమణి, వెంకటలక్ష్మీ, గ్రామస్థులు శివ, శివలీల, ఐశ్వర్య, రామలక్ష్మీ, వేణుగోపాలకృష్ణ, శేషుకుమారి, నాగలక్ష్మీ, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, స్వామి పాల్గొన్నారు.


కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

● ముత్యాల శ్రీనివాస్

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : జాతీయ తపాలా వారోత్సవాలు-2025లో భాగంగా ఈ నెల 6 నుంచి 10వ తేదీవరకు డివిజన్ ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ నమోదు(ఎన్‌రోల్‌మెంట్), అప్‌డేట్ సేవలను అందించడానికి ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు గుడివాడ తపాలా శాఖ సూపరిటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు ముత్యాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు క్యాంపులను వివిధ తపాలా కార్యాలయాల్లో, నిర్దేశించిన పాఠశాలలు, నివాసకాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలతో సహా ఎంపిక చేసిన ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో పౌరులందరికీ ఆధార్ నమోదు(ఎన్‌రోల్‌మెంట్), జనాభా సంబంధిత(డెమోగ్రాఫిక్), బయోమెట్రిక్ అప్‌డేట్‌లు వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 5 నుంచి 7, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్‌లు ఉచితంగా అందించనున్నామన్నారు. 7 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం చేసే తప్పనిసరి బయో మెట్రిక్ అప్‌డేట్ 1లకు(ఎంబీయు-1) సంబంధించి అక్టోబరు 1వ తేదీ నుంచి 30 సెప్టెంబరు 2026వ తేదీ వరకు ఒక ఏడాది పాటు రుసుములకు యుఐడీఏఐ మినహాయింపు ఇచ్చిందన్నారు. తపాలశాఖ ఆర్థిక చేరికను ప్రోత్సహించేందుకు పోస్టాఫీసు పొదుపు బ్యాంకు ఖాతాలు, పది సంవత్సరాల లోపు ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరచుకునే వెసలుబాటు కల్పిస్తుందన్నారు. ప్రజలు, విద్యార్థులు, యువత ఈ క్యాంపుల ద్వారా అందు బాటులో ఉన్న ఆధార్ మరియు ఆర్థిక సేవలను వినియో గించుకుని లబ్ధిపొందాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు ముత్యాల శ్రీనివాస్ కోరారు.


ముత్యాల శ్రీనివాస్

పారదర్శకంగా స్వామిత్వ సర్వే జరగాలి

● ఎంపీడీవో కాండ్రు జ్యోతి

పామర్రు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల నివాస ప్రాంతాలకు సంబంధించి వారి ఆస్తిపై పూర్తిహక్కు కల్పించేలా చేపట్టిన స్వామిత్వ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని పామర్రు ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. చెన్నువానిపురం ఎస్సీకాలనీలో బుధవారం ప్రారంభమైన స్వామిత్వ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులకు పలుసూచనలు సలహాలందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో మెరుగైన సాంకేతికతో కూడిన సర్వేమ్యాపింగ్ కోసమే స్వామిత్వ స్కీమ్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక సాధికారిక, స్వీయ సాధికారితను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ తీసుకున్న ఆదేశాలకు అనుగుణంగా పామర్రులోని 20 వార్డుల్లో ప్రజల ఆస్తి డేటా సేకరించేందుకు సాంకేతికతకూడిన డ్రోన్ల సాయంతో ఖచ్చితమైన కొలతలతో ఈసర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు పూజ, తనూజ, నవీన్, కాశీవిశ్వనాథ్, సర్వేయర్లు నిహారిక, హాఫిజ్‌ఆలీ, భవానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలి

● పి. రాజేష్

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : సాంకేతికతల పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలని, వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్‌లు అన్వయిస్తాయని అక్యూరైజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. రాజేష్ అన్నారు.బుధవారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో 'స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్'పై మూడురోజుల జాతీయ స్థాయి కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేష్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్, డేటా విశ్లేషణ, ప్రిడిక్షన్ మోడల్స్‌ను వాస్తవ అనువర్తనాలకు అన్వయించే నైపుణ్యాన్ని పొందుతారన్నారు. పరిశ్రమల్లో ఉపయోగించే స్మార్ట్ మానిటరింగ్, ఆటోమేషన్, నిర్ణయాల ప్రక్రియలను అర్థం చేసుకుంటారన్నారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి యమ్.నాగు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్


కుక్కకాటు బాధితురాలిని పరామర్శిస్తున్న జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ


బాధితురాలిని పరామర్శిస్తున్న బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు రామకృష్ణ

కుక్కకాటు బాధితులకు జనసేన, బీజేపీ నేతల పరామర్శ

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : కుక్క కాటుకు గురై ఈ నెల 7వ తేదీ స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రామనపూడికి చెందిన బాలిక మోక్షను జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె)లు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బూరగడ్డ మాట్లాడుతూ గుడివాడ పట్టణ, గ్రామాల్లో కుక్కలు చిన్న పిల్లల మీద దాడి చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ అధికారులు దృష్టిపెట్టి కుక్కలను నియంత్రించాలని కోరారు. ఆర్‌కె నేతృత్వంలో బీజేపీ నాయకులు ఆర్‌డీవో కార్యాలయ ఏవో బాలాజీకి వినతిపత్రం అందజేశారు.


ఎస్టేట్ అధికారిని సత్కరిస్తున్న శివరామయ్య

కూచిపూడి ఎస్టేట్ అధికారికి సత్కారం

కూచిపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలోని కూచిపూడి రైతు బజార్‌ను స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అవార్డు అందించిన నేపథ్యంలో ఎస్టేట్ అధికారి చంద్రమోహనరావును బుధవారం కూచిపూడి ఏఎంసీ కార్యాలయంలోనూ, రైతు బజార్‌లోనూ ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మార్కెటింగ్ శాఖ ఏడీ ఎల్.సత్యానందంలు ఎస్టేట్ అధికారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. రైతు బజార్ దుకాణదారులు, సిబ్బంది, ఏఎంసీ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఏఎంసీ కార్యదర్శి అక్బర్ బాషా తదితరులు చంద్రమోహనరావును సత్కరించారు.


విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యుత్ దీపాల ఏర్పాటు

గుడ్లవల్లేరు : ఇటీవల గుడ్లవల్లేరులో 11 కేవీ విద్యుత్ లైన్లు, లూజ్ స్పాన్ కారణంగా గ్రామంలో పలు చోట్ల వందకు పైగా వీధి ఎల్‌ఈడీ లైట్లు కాలిపోయాయి. గ్రామ పంచాయతీ వాటి స్థానంలో బుధవారం 100 కొత్త లైట్లను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. రోడ్లపైకి ఆవులు, గేదెలు , పందులు యథేచ్ఛగా వదిలేస్తే వాటిని పట్టివేసి పందులను అడవుల్లో వదిలేస్తామని, ఆవులను గోశాలలకు తరలిస్తామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. ఇక గృహ యజమానులు ఇంటి పన్నులను స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కార్యదర్శి నరసింహారావు తెలిపారు


కుదరవల్లిలో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కుక్కల స్వైర విహారం

నందివాడ : మండలంలోని పోలుకొండ, అంకన్నగూడెం, తమిరిశ, కుదరవల్లి పలు గ్రామాల్లో గ్రామ సింహాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో కుక్కలు కనిపిస్తేనే ఎక్కడ కరుస్తాయో అన్న భయంతో మండలంలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి 7 గంటలు దాటితే బైక్‌లపై ప్రయాణం కుక్కలతో నరకమే. కుక్కలు గ్రామాల్లో ప్రజలపై వీరవిహారం చేస్తుంటే సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవటం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బుధవారం కుదరవల్లిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై కుక్కలు బైక్ వెంటపడి మరీ పిక్కలపై కరవటంతో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పెదపారుపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడ గ్రామశివారు పులవర్తివానిగూడెంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన దిరిశిన భుజంగరావు ఇటీవల మృతి చెందగా, ఆయన గృహానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి పీ 4 పథకం ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం గుమ్మడి బాబురావు గృహానికి వెళ్లి ఇటీవల ఆయన మరణించటంతో ఆ కుటుంబసభ్యులను పరామర్శించారు. పీ4 పథకం ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయమందించారు. చోరగుడి కుమార్ బాబు అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకుంటుండగా, ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. రాచూరి ప్రభుదాస్‌కి పీ4 పథకం ద్వారా ఆర్థిక సాయమందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, వెంట్రప్రగడ పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బారావు చౌదరి, చిలకా ఆంజనేయులు, బాబి, రాచూరి సురేష్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

చాపలు, దుప్పట్లు, సామగ్రి వితరణ

గుడివాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నీలామహల్ రోడ్డులోని అంగన్వాడీ కేంద్రానికి(అల్లంబడి) కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు సహకారంతో చాపలు, దుప్పట్లు, స్టీల్ గ్లాసులను అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, టీడీపీ నాయకులు కోడూరి ప్రభు, గొర్రెల నరేంద్రకుమార్, పోలవరపు శ్రీనివాసరావు, చందు శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్లు రమా, పైడమ్మ పాల్గొన్నారు.

బాపిరాజు జయంతి

గుడివాడ రూరల్: స్థానిక చౌటపల్లి గ్రంథాలయంలో ప్రముఖ కవి, నటుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అడవి బాపిరాజు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అడవి బాపిరాజు ఔన్నత్యం గురించి తెలిపారు. గ్రంథాలయ అధికారి రత్నచంద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

గుడివాడ రూరల్: విద్యార్థులు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ ప్రగతి అధ్యక్షుడు మాదాల సురేష్ అన్నారు. బుధవారం గంగాధరపురం ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా బాలికలకు దీనిపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రగతి తరపున ఏలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుంటామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆరోగ్యం, పారిశుధ్యం, పరిశుభ్రతపై చక్కగా బోధించాలని సూచించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కేశవరావు, రాంబాబు, మహంకాళి, వీరశేఖర్, వేణుబాబు, నల్లూరి శేషగిరిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ ఆధునీకరణకు విరాళాలు

గుడ్లవల్లేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో గ్రామస్థులందరూ కలసి ఐకమత్యంగా గ్రామంలో రెండు ప్రసిద్ధ దేవాలయాలను పునః నిర్మించడం అభినందనీయమని లండన్‌కు చెందిన డాక్టర్ సూర్యదేవర యదు పూర్ణచంద్ర ప్రసాదరావు అభినందించారు. బుధవారం రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ నిర్మాణ పనులను, గంగానమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణ పనులను డాక్టర్ సూర్యదేవర యదు పూర్ణచంద్ర ప్రసాదరావు, డాక్టర్ జగన్మోహిని దంపతులు పరిశీలించారు. గ్రామంలో సత్యదేవుని ఆలయ గోపుర జీర్ణోద్ధరణ, ఆలయ ఆధునీకరణ, గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ నూతన ఆలయ నిర్మాణానికి ఈ దంపతులు, వారి కుమారులు డాక్టర్ సూర్యదేవర వంశీ సుచేత్ రావు, డాక్టర్ సూర్యదేవర సందీప్‌రావులు కలసి ఆలయాల అభివృద్ధి, నిర్మాణాలకు పది లక్షల రూపాయిలు విరాళంగా ప్రకటించారు. నిమ్మగడ్డ కృష్ణవేణి, భర్త నిమ్మగడ్డ వెంకటేశ్వర వరప్రసాద్ దంపతులు ఒక లక్ష రూపాయిలు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థులు కొందరు రూ. 50 వేలు, గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్ విశ్రాంత హిందీ ఉపాధ్యాయిని కంబంపాటి రంగనాయకమ్మ, కోటేశ్వరరావుల జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రముఖ నాయవాది కంబంపాటి రవి, పద్మజ దంపతులు రూ. 25 వేలు తమ విరాళాలను అందజేశారు.


విరాళాన్ని అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్ దంపతులు

జీఎస్టీ తగ్గింపుతో పేదవర్గాలకు మేలు

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


పెదపారుపూడిలో..

పెదపారుపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం బుధవారం వెంట్రప్రగడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ద్వారా అన్ని వర్గాల వారికి మేలు కలుగుతుందని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, చిలకా ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : విద్యార్థులు సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాలను తెలుసుకోవడంతోపాటు, వాటిపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని పామర్రు-2 సచివాలయ జీఎస్టీ చాంపియన్ పులిగడ్డ రాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక ప్రసన్న జూనియర్, డీగ్రీకళాశాలలో విద్యార్థులకు బుధవారం సూపర్‌జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఒకటో సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శి ఇందుపల్లి స్వాతి మాట్లాడుతూ, విద్యార్థులకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదేనన్నారు. తొలుత పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్


పామర్రులో..

గుడివాడ రూరల్ : మండల ప్రజలు వస్తువులు, పరికరాలపై ప్రభుత్వం ఏ విధంగా పన్నులు ఎంత మేర వేస్తుందో తెలుసుకోవాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. బుధవారం మల్లాయిపాలెంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 మీద ప్రజలకు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. ఏ వస్తువుపై ఎంత తగ్గిందో స్పష్టంగా తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు షేక్ మోర్, ఉంగరాల మురళీ, పంచాయతీ సిబ్బంది, మల్లాయిపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.



హుండీల కానుకల లెక్కింపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బచ్చుపేట భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను బుధవారం తెరిచి కానుకలను లెక్కించారు. వేంకటేశ్వరస్వామికి ఆదినెల 14 రోజులకు రూ.4,71,015 ఆదాయం, మల్లేశ్వరస్వామికి రూ.1,25,110 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో డి.వెంకట కృష్ణారావు తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు కె.శ్రీనివాసరావు, వంశపారంపర్య ధర్మకర్త ముత్యేవి రవికాంత్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, గరుడ సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికీ మేలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ 2.0తో తెచ్చిన సంస్కరణలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా తగ్గాయని, ప్రతీ కుటుంబానికి రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకు లబ్ధి చేకూరుతోందని టీడీపీ సీనియర్ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పిస్తూ బుధవారం ఈడేపల్లి ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గోపీచంద్ పాల్గొన్నారు. విద్యార్థులకు కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇంజనీర్ మురళీధర్, ప్రిన్సిపాల్ బీవీఎల్ నరసింహారావు, కాశివిశ్వనాథ రాము, టీడీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్, జి.రవిప్రసాద్, అశ్వంతి రామాంజనేయులు, జె.ప్రత్యూష, ప్రైవేటు పాఠశాలల సంఘ రాష్ట్ర నాయకుడు వి.సుందరరాం పాల్గొన్నారు.



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, వ్యవసాయశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెం లో జీఎస్టీ స్లాబ్ రేట్లపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోనకళ్ల నవరంగ ప్రసాద్, మధుసూదనరావు, కొండేటి సుబ్రహ్మణ్యం, వాకా నందీశ్వరరావు, వాకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు

జీఎస్టీ సంస్కరణలపై బుధవారం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు కొల్లు ఫౌండేషన్ తరఫున జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు విజయశ్రీ, మమత, మున్వర్, సురేష్ పాల్గొన్నారు.

స్వతంత్రపురం హైస్కూల్‌లో..

కోడూరు: జీఎస్టీ తగ్గింపుపై రెండు రోజులపాటు స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మెండు ఉమామహేశ్వరరావు తగ్గించిన జీఎస్టీ వస్తువుల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు సనకా కోటేశ్వరరావు, కె.మధుసూదన్ పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణలపై అవగాహన అవసరం

పెడన: ప్రతి ఒక్కరూ జీఎస్టీ సవరణలపై అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అత్తిలి రంగామణి అన్నారు. పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్‌లో బుధవారం సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ 2.0లో 18, 5 శాతం స్లాబులు మాత్రమే ఉన్నాయన్నారు. జీఎస్టీ 2.0పై తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి సూచించారు. జీఎస్టీ 2.0పై విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ అనుమకొండ గౌరీప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రంగామణి

పంట కాలువలో మృతదేహం

కోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ - కోడూరు ప్రధాన పంట కాలువలో వి.కొత్తపాలెం గ్రామం వద్ద పురుషుడి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూ కలర్ గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాయని, సుమారు పాతికేళ్ల వయసు ఉంటుందని ఎస్ఐ చాణక్య తెలిపారు. వీఆర్వో మజీబులా ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు అవనిగడ్డ సీఐ, కోడూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.


ఆక్రమిత షాపులు స్వాధీనం చేసుకుంటున్న రంగనాయకస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.వెంకట సాంబశివరావు

అందుబాటులోకి శ్మశానవాటిక భవనం

గూడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో కప్పలదొడ్డి గ్రామంలో శ్మశానవాటికలో సకల సదుపాయాలతో నిర్మించిన భవనాన్ని బైరాగిపురం నాయకులు బుధవారం గ్రామస్థులందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. శ్మశానానికి వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో స్నానాలు ఆచరించేందుకు, మహిళలు పుణ్యతిథి పూజలు చేసేందుకు, కనీస వసతులు, దహన తదితర కార్యక్రమాలు జరుపుకునేందుకు అనుకూలంగా భవనాన్ని నిర్మించారు. మరణించిన వారి ఇంటి దగ్గర నుంచి శ్మశాన వాటిక వరకు తరలించేందుకు కైలాసరథ వాహనం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఈ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న పేరిశెట్టి నాగరు, బూనం సాయిబాబు, బళ్ల నాగేశ్వరరావు, మరక విశ్వేశ్వరరావుకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

ఆక్రమిత షాపులు స్వాధీనం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమించుకుని 50 ఏళ్ల నుంచి అద్దె చెల్లించకుండా షాపులను నిర్వహిస్తున్న ఆక్రమణదారులను బుధవారం అధికారులు తొలగించారు. ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు మేరకు పోలీసుల సాయంతో రెండు షాపులను దేవాదాయశాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, రంగనాయకస్వామి దేవాలయం ఈవో మాగంటి సత్యనారాయణబాబు, తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, ఈవోలు నమ్మిట ఆంజనేయస్వామి, టీవీవీ మోహనరావు, వై.శిరీష, ఎస్.అరుణ, ఆర్.మాధవిలత, జి.వెంకటకృష్ణారావు, వీఆర్వో లక్ష్మి పాల్గొన్నారు.

అడవి బాపిరాజు సాహిత్యం నిత్యనూతనం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి అడవి బాపిరాజు సాహిత్యం నిత్య నూతనంగా ఉంటుందని, ఆయన నవలలను పాఠకులు ఇప్పటికీ ఆదరిస్తున్నారని డిప్యూటీ లైబ్రేరియన్ వీరం వెంకటరమణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అడవి బాపిరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. బాపిరాజు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం శాఖా గ్రంథాలయంలో..

ఘంటసాల: శ్రీకాకుళం శాఖా గ్రంథాలయంలో అడవి బాపిరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. నవలా రచయితగా పేరొంది పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన అడవి బాపిరాజు గొప్ప సాహితీవేత్త అని గ్రంథాలయాధికారి దారా సుజాత కొనియాడారు. ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగరాజు, కృష్ణారావు, భవిత స్కూల్ మాస్టర్లు శ్రీకాంత్, నాగరాజు, మల్లేశ్వరరావు, గ్రామపెద్ద కొండా బాబూరావు, అంగన్‌వాడీ టీచర్ ఆదిరాల కనకదుర్గ పాల్గొన్నారు.


మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అడవి బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారులు


అట్లతద్ది సందర్భంగా సంతంత్రపురంలో రోటి ఉయ్యాలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి శ్రీనివాసరావు

రోటి ఉయ్యాల ప్రారంభం

కోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అట్లతద్ది పండుగ సందర్భంగా స్వతంత్రపురం గ్రామంలో రోటి ఉయ్యాలను జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. తెలుగు సంప్రదాయాలను గుర్తు చేస్తూ వీరంకి వెంకన్న ఆధ్వర్యంలో రోటి ఉయ్యాల వేయడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బొలిశెట్టి విశ్వేశ్వరరావు, తోట సాంబశివరావు, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, వేములపల్లి రాజేష్ పాల్గొన్నారు.

ఏడు శనివారాల వ్రతాలు,

ప్రతి నెలా శాంతి కల్యాణం

● నిర్వహించాలని గొడుగుపేట వెంకటేశ్వరస్వామి దేవాలయ పాలకమండలి నిర్ణయం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శాంతి కల్యాణం నిర్వహించాలని, ఏడు శనివారాల వ్రతాలు ప్రారంభించాలని నూతన పాలకమండలి నిర్ణయించింది. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వద్దమూడి లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన బుధవారం ఆలయంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించడం, మహిళలకు భజన శిక్షణ ఇవ్వడం, అద్దాల మండపం నిర్మాణంపై చర్చించారు. ఈవో పీవీ గోపాలరావు పాల్గొన్నారు.

హనుమంతుని ఉపాసనతో సకల విజయాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమంతుని ఉపాసన చేయడం ద్వారా సకల విజయాలు కలుగుతాయని, రామాయణంలోని సుందరకాండ పారాయణ చేయడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం లభిస్తుందని ఆధ్యాత్మికవేత్త వడ్లమన్నాటి మారుతి దివాకర్ శర్మ అన్నారు. వరాహపేట సువర్చలా సమేత ఆంజనేయస్వామి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సుందరకాండపై ఆయన ఉపన్యసించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సుందరకాండ పారాయణ చేస్తున్న వడ్లమన్నాటి మారుతిదివాకర్ శర్మ

తాళ్లపాలెంలో పొలంబడి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బందరు మండలం తాళ్లపాలెంలో బుధవారం వ్యవసాయ శాఖాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశెనగ పంట సంరక్షణపై రైతులకు ఏవో ఎం.రాజకుమార్ పలు సూచనలు ఇచ్చారు. ఆకుముడ్త తెగులును తట్టుకునే రకాలను సాగు చేయాలని సూచించారు.


పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

రేపు దీవి గోపాలాచార్యులు విగ్రహావిష్కరణ

నాగాయలంక, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బావదేవరపల్లి గ్రామంలో పండిత దీవి గోపాలాచార్యులు విగ్రహాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ తెలిపారు. కూటమి నేతలు పాల్గొంటారని, ఈ సందర్భంగా విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


నారికేడలవారిపాలెంలో రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో కె. స్వాతి

భూముల రీ సర్వేకు సహకరించండి

● రైతులతో బందరు ఆర్డీవో కె.స్వాతి

గూడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని బందరు ఆర్డీవో కె.స్వాతి కోరారు. బుధవారం మండలంలోని నారికేడలవారిపాలెంలో రీ సర్వేపై ఆమె గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే వల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, ఎండీవో తైలకుమారి, సర్పంచ్ జంపన రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ జ్ఞానసాయి, మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్వో వి.కామేశ్వరరావు, విలేజ్ సర్వేయర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

కూటమి ప్రభుత్వానికి ఆటోడ్రైవర్ల కృతజ్ఞతలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సేవలో పథకం అమలు చేసినందుకు కూటమి ప్రభుత్వానికి ఆటోడ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో బందరు మండలం కానూరు గ్రామంలో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. వైసీపీ పాలనలో ఆటో డ్రైవర్లకు రూ.10వేలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుందని గోపు సత్యనారాయణ అన్నారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించడం ముదావహమన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పీత రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, మోపిదేవి కృష్ణ, నరసింహారావు, విజయకుమార్, మరీదు రామచరావు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులు వైసీపీ నాయకులు

● కలంకారీ క్లస్టర్‌కు భూముల కేటాయింపును వ్యతిరేకించడంపై టీడీపీ నేతల ఆగ్రహం

పెడన, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదరి మంది కలంకారీ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయనున్న కలంకారీ క్లస్టర్‌కు భూముల కేటాయింపును వ్యతిరేకించిన వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ కక్షతో భూముల కేటాయింపును వైసీపీ నాయకులు వ్యతిరేకించారని, వారు చెబుతున్న కారణాలు అర్థరహితంగా ఉన్నాయని వారు అన్నారు. క్లస్టర్ ఏర్పాటు కోసం అధికారులు ఎంపిక చేసిన నాలుగు స్థలాలు ఏనాడో వివిధ ప్రభుత్వ శాఖలకు అప్పగించామని వైసీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన భూములు ప్రభుత్వానివి కాదా అని వారు ప్రశ్నించారు. ఆవినీతే తప్ప అభివృద్ధి పట్టని వైసీపీ నాయకులు కలంకారీ క్లస్టర్‌ను అడ్డుకోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. టీడీపీ అభివృద్ధికి చిరునామా అని, పట్టణంలో జూనియర్ కళాశాల, పురపాలక శాఖ సంఘ కార్యాలయ భవన నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, మార్కెట్ భవనాల నిర్మాణం టీడీపీ హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో క్లస్టర్‌ను తీసుకొచ్చి చూపిస్తామని వారు సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు రాసున్న మునిసిపల్ ఎన్నికల్లో కలంకారీ కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని టీడీపీ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, అబ్దుల్ ఖయ్యూం, కమ్మగంటి బాబు, మహబూబ్, వరసా జితేంద్ర, యర్రా నాగరాజు, తమ్మా భీమయ్య, ఎలిగెట్ల ప్రసాద్, సేనాపతి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణా విశ్వవిద్యాలయంలో క్రీడా దినోత్సవం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి తెలిపారు. పురుషులకు, మహిళలకు వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ ఉంటుందన్నారు. సోలో, గ్రూప్ వారీగా పాటలు, డ్యాన్స్, స్కిట్స్ పోటీలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.


ఫెన్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించిన బీ ఫార్మసీ విద్యార్థి అలోషియాస్‌ను అభినందిస్తున్న కేయూ ఉపకులపతి రాంజీ

బంగారు పతక విజేతకు అభినందన

మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ టోర్నమెంట్‌లో విశ్వవిద్యాలయం బీ ఫార్మసీ విద్యార్థి అలోషియాస్ బంగారు పతకం సాధించాడు. అలోషియాస్‌ను బుధవారం ఉప కులపతి ఆచార్య కె.రాంజీ అభినందించారు. నవంబరు 6 నుంచి అమృతసర్‌లోని గురునానక్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్టు అలోషియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నాగాయలంక, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పర్రచివర గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒడుగు కోటేశ్వరమ్మ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు లక్షన్నర రూపాయల విలువైన వస్తువులు కాలిపోయినట్టు రెవెన్యూ అధికారులు ప్రాథమిక అంచనాలో నిర్ధారించారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర నాయకులు బోగాది రమాదేవి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు.


మార్నింగ్ వాక్ చేస్తూ ఆటోను ఆపి ప్రయాణికులు, డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజలతో మమేకం

● రైల్వేస్టేషన్ నుంచి బందరుకోట వరకు ప్రజలతో మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర మార్నింగ్ వాక్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం రైల్వేస్టేషన్ నుంచి బందరుకోట వరకు మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. దారిపొడవునా అభివృద్ధి ప్రణాళికలు, సమస్యలపై ఆయన ముచ్చటించారు. ఆటోలను ఆపి డ్రైవర్లతో మాట్లాడారు. రూ.15వేలు బ్యాంకుఖాతాలో జమ అయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టీ షాపుల్లో టీ తాగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బచ్చుల అనిల్‌కుమార్, లోగిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

మచిలీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ప్రజల విశ్రాంతి, వినోదానికి అనువుగా, పర్యావరణహితంగా పార్కును అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు. టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

అవనిగడ్డ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 7వ వార్డులో బుధవారం హనుమత్ సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్ల నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రతిష్ఠామూర్తులను దర్శించుకున్నారు. మండలి వెంకట్రామ్, మోటమర్రి బాబా ప్రసాద్, యాసం చిట్టిబాబు, రాజనాల వీరబాబు పాల్గొన్నారు.

